www.citytimesnews.com

# సిటీ టైమ్స్

తెలుగు దినపత్రిక

Hyderabad | Adilabad | Rangareddy | Nalgonda | Medak | Mahaboobnagar | Karimnagar | Warangal | Khammam | Nizamabad

సంపుటి - 26 | సంచిక - 178 | హైదరాబాద్ | శుక్రవారం | తేదీ:29.05.2026 | పేజీలు 10 | వెల రూ.3 | epaper.citytimesdaily.com


### తమిళనాడు సీఎం విజయ్
## ఢిల్లీ పర్యటనలో ట్విస్ట్

- సోనియా, రాహుల్‌తో నేటి భేటీ వాయిదా
- హఠాత్తుగా వాయిదాపై తీవ్ర చర్చ
- వచ్చే వారం కచ్చితంగా భేటీ ఉంటుంది: టీవీకే పార్టీ వర్గాల వెల్లడి

2లో..

### నేను బాధ్యత
## తీసుకుంటున్నా



2లో..

# సిద్ధరామయ్య రాజీనామా

- గవర్నర్‌కు రిజైన్ లేఖ
- ఢిల్లీకి వెళ్లి సోనియా, రాహుల్‌తో భేటీ
- డీకే శివకుమార్‌తో కలిసి వెళ్లి గవర్నర్‌కు లేఖ
- హైకమాండ్ ఏ బాధ్యత అప్పగించినా నిర్వర్తిస్తా
- ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాను

**బెంగళూరు, సిటీ టైమ్స్**

కర్ణాటకలో గత కొన్నేళ్లుగా సాగుతున్న సీఎం సీటు పంచాయతీ ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చినట్లయింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు. ఇక కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అంటూ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నేతలు హింట్ ఇచ్చేశారు. తాజాగా డీకే శివకుమార్ సహా పలువురు మంత్రులతో కలిసి.. లోక్‌భవన్‌కు వెళ్లిన సిద్ధరామయ్య.. తన రాజీనామా లేఖను ఇచ్చారు. గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖను సమర్పించారు. ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్న గవర్నర్.. సిద్ధూ రాజీనామాపై నిర్ణయం తీసుకోనున్నారు.

9లో..



### తెలంగాణకు టీడీపీ
## అవసరం

- లోకేశ్ లాంటి డైనమిక్ లీడర్ కావాలి
- ఆ పార్టీ నేత జ్యోత్స్న

2లో..






ఏఐ ఫొటో

### రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి
# యూనిఫైడ్ కార్డ్

- సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో
- త్వరలో అందుబాటులోకి..
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసిన సీఎం
- అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి
- అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటా తీసుకోవాలి
- దీని కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశం

8లో..

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డ్) రూపొందించాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు , సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి , ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి గారితో పాటు ఇతర ఉన్నతాధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించారు.

### సహకార ధోరణితో
## పరిష్కరించుకోవాలి

- అంతర్రాష్ట్ర జల వివాదాలపై మోదీ
- సకాలంలో అనుమతులు, పర్యవేక్షణ
- సాంకేతిక ఆధారిత పర్యవేక్షణతో సాల్వ్ చేసుకోవాలి

2లో..



### కేసీఆర్‌కు రాజకీయ
## భిక్ష పెట్టిందెవరు?

- ఎన్టీఆర్ లేకుండానే నాయకులయ్యారా?
- ఎన్టీఆర్, ఇందిరాగాంధీ స్ఫూర్తితో పాలన
- సీఎం రేవంత్ రెడ్డి సంచలన కామెంట్లు



2లో..

# రాయదుర్గం మస్త్ పిరం!

- హైదరాబాద్‌లో ఎకరా రూ.237 కోట్లు
- రికార్డు స్థాయిలో భూమి ధరలు
- భూములకు కనీస ధరనే రూ.139 కోట్లు
- గతేడాది రూ.177 కోట్లు పలకడం గమనార్హం

9లో..



**రాయదుర్గం, సిటీ టైమ్స్**

విశ్వ నగరంగా మారుతున్న హైదరాబాద్‌లో తెలంగాణ భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ఏటికేడాది భూముల ధరలు ఎన్నో రెట్లు పెరిగిపోతున్నాయి. తెలంగాణ గ్రోత్ అండ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ భూములను విడతల వారీగా వేలానికి అందుబాటులో ఉంచుతోంది.

### జూన్ 6 వరకు
## ధాన్యం కొనుగోళ్లు

- మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి
- చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం
- ధాన్యం ఎలా ఉన్న కొంటాం.. రైతులు భయపడొద్దు



9లో..

## ముస్లింలకు 4 శాతం
### రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్
### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



9లో..

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని వ్యాఖ్యానించారు. నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో ముస్లిం సోదరులను కలిసి మాట్లాడారు. బక్రీద్ కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదని... ఇది మానవాళికి ఒక గొప్ప జీవన సందేశమని పేర్కొన్నారు.



### కాజీపేటలో ఐదేళ్లలో
## 200 ఇంటర్‌సిటీ
## రైళ్ల తయారీ

9లో..

- కాజీపేటలో రైల్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చింది
- మంత్రి అశ్విని వైష్ణవ్

## పొంగులేటి కట్టుబడి ఉండాలి

- సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ అలవాటు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాల్లో ఓట్లు అడగొద్దు మరి
- డబుల్ బెడ్‌రూం లేని గ్రామాల్లో మేమూ ఓట్లు అడగం
- సవాల్‌ను పొన్నం స్వీకరించాలని డిమాండ్

9లో..



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు.



# తెలంగాణకు టీడీపీ అవసరం

## - మహానాడుకు హాజరు.. కీలక వ్యాఖ్యలు
## - తెలంగాణ విద్యాభివృద్ధి తీర్మానం

**మంగళగిరి, సిటీ టైమ్స్**

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు సందర్భంగా టీడీపీ తెలంగాణ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న.. సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అవసరం ఉందని ఆమె తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు లాంటి నాయకుడి దిశానిర్దేశం తెలంగాణ రాష్ట్రానికి అవసరమని జ్యోత్స్న పేర్కొన్నారు. ఇక డైనమిక్ ఆలోచనలు ఉన్న నారా లోకేష్ వంటి నేత తెలంగాణకు కావాలని ఆమె కోరారు. అందుకే మళ్లీ తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని జ్యోత్స్న వెల్లడించారు.

మహానాడులో భాగంగా తెలంగాణ విద్యాభివృద్ధి అనే తీర్మానం ప్రవేశ పెట్టిన జ్యోత్స్న.. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు సామాజిక న్యాయాన్ని దివంగత నేత ఎన్టీఆర్ కల్పిస్తే.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు విస్తృత అవకాశాలు ఇచ్చారని జ్యోత్స్న గుర్తు చేశారు. భవిష్యత్ నైపుణ్యాన్ని నారా లోకేష్ ఇస్తున్నారని పేర్కొన్న జ్యోత్స్న.. దాన్ని తెలంగాణకు కూడా ఇవ్వాలని కోరుతున్నట్లు చెప్పారు. తెలంగాణలో టీచర్ పోస్టుల భర్తీని పారదర్శకంగా జాబ్ క్యాలెండర్ ప్రకారం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

తెలుగుదేశం పార్టీ ఎన్నడూ ఓట్ల కోసం రాజకీయం చేయదని తెలిపిన జ్యోత్స్న.. గత 22 ఏళ్లుగా రాష్ట్రంలో అధికారంలో లేకపోయినప్పటికీ.. పసుపు జెండాను మాత్రం తాము అనుక్షణం గుండెల్లో పెట్టుకుని.. కష్టపడి, పోరాడి నిలబడేవాడే తెలంగాణ కార్యకర్త అని గుర్తు చేశారు. విద్య, ఉద్యోగం, అభివృద్ధి అనేవి తెలుగుదేశం పార్టీ విధానమని జ్యోత్స్న వెల్లడించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ వేసిన పునాది వల్ల విద్యా విప్లవం రావాలని.. కానీ రాష్ట్ర విభజన తర్వాత ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ వంటి యూనివర్సిటీలు ర్యాంకింగ్‌లోనూ వెనుకబడ్డాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణలోని ప్రభుత్వ స్కూళ్లు పేద పిల్లలకు గర్వంగా మారాలని.. పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ భరోసాగా ఉండాలని జ్యోత్స్న పేర్కొన్నారు. చదువుకుని డిగ్రీలు ఉన్న యువతకు ఉద్యోగాలు రావాలని.. కానీ తెలంగాణలో ఇవేవీ రాలేదని చెప్పారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో మాటలు పెద్దవి.. చేతలు శూన్యమని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పార్టీ పాలనలో విద్యా రంగంలో స్పష్టమైన టైం బౌండ్ రోడ్ మ్యాప్ కనిపించడం లేదని.. అంతేకాకుండా తెలంగాణకు ప్రత్యేకంగా విద్యాశాఖ మంత్రే లేకపోవడం మరో దౌర్భాగ్యం అని జ్యోత్స్న వివరించారు.

---

### సహకార ధోరణితో

# పరిష్కరించుకోవాలి

## ప్రాజెక్ట్ అమలులో జాప్యం.. ఖర్చులు పెరుగుతాయి

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

అంతర్రాష్ట్ర జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలన్నారు. ఈ విషయంలో కెన్‌బెట్వా ప్రాజెక్టు ఓ నమూనాగా నిలవాలని చెప్పారు. కెన్‌బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రధాని సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం.. ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని రాష్ట్రాలకు మోదీ సూచించారు. 'స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0'ను కూడా సమీక్షించారు. నగరాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల వినియోగాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. కాల్వల వెంబడి, కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలనూ అన్వేషించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.



---

# కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందెవరు?

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

దేశం గర్వించదగిన గొప్ప నేత ఎన్టీఆర్ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్, ఇందిరాగాంధీ స్ఫూర్తితో తమ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని చెప్పారు. తమకు ఇందిరాగాంధీ ఎంత ముఖ్యమో.. ఎన్టీఆర్ కూడా అంతే ముఖ్యమన్నారు. అమీర్‌పేట మైత్రీవనం సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.



కాంగ్రెస్ సీఎం, పీసీసీ చీఫ్ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎలా ఆవిష్కరిస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు. కులమతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా దేశం గర్వించదగిన నాయకుడు ఎన్టీఆర్. అందుకే ఆయన విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డులో ఆవిష్కరించుకున్నాం. నాకు జీవితకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం. ఈ విషయంలో ఎవరు ఎలాంటి విమర్శలు చేసినా భయపడను. ఆనాడు ఇందిరాగాంధీ.. తెలంగాణ ప్రాంతం నుంచి పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, వెంకటస్వామిలాంటి నేతలను అందించారు. ఎన్టీఆర్.. తెలంగాణ ప్రాంతానికి తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, కడియం శ్రీహరి, దేవేందర్‌గౌడ్, మోత్కుపల్లి లాంటి నాయకులను అందించారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎవరు? ఎన్టీఆర్ నీడన బతికిన మీరు ఆయన్ను తక్కువ చేసి మాట్లాడటం సమంజసమా? ఎన్టీఆర్ లేకుండానే నాయకులయ్యారా? ఆయన ఆశీర్వాదంతోనే పాలితులుగా ఉన్న ఎంతో మంది పాలకులయ్యారు. గ్రామాల్లో పటేల్ పట్వారీ వ్యవస్థను ఎన్టీఆర్ రద్దు చేసి పేదలకు విముక్తి కల్పించారు. ఆయన పేరు పెట్టుకున్న కొందరు నకిలీలు కూడా రాజకీయాల్లో ఉన్నారు'' అని రేవంత్ వ్యాఖ్యానించారు.

''దేశ చరిత్రను ఎవరూ చదవాలన్నా, స్ఫూర్తి పొందాలన్నా ముగ్గురు జాతిరత్నాలను స్మరించుకోవాలి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ సీఎం ఎన్టీఆర్ జాతి రత్నాలు. నిరంతరం వారి కీర్తి ప్రతిష్ఠలు, నిర్ణయాలను గుర్తుచేసుకోవాలి. అంబేడ్కర్.. పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించారు. ఇందిరాగాంధీ.. భారత్‌ను ప్రపంచ దేశాల ముందు తలెత్తుకునేలా చేశారు. భూసంస్కరణలతో పేదలకు ఎంతో లబ్ధి చేకూర్చారు. తెలుగుజాతిలో స్ఫూర్తి నింపిన నేత ఎన్టీఆర్. బడుగు, బలహీనవర్గాల కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేశారు.

**మైత్రీవనం సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ**

నగరంలోని అమీర్‌పేట మైత్రీవనం సర్కిల్‌లో మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎన్టీఆర్ కుమారులు నందమూరి రామకృష్ణ, మోహనకృష్ణ, సినీనటుడు మంచు మనోజ్, దర్శకుడు బోయపాటి శ్రీను, పెద్ద ఎత్తున అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

---

### తమిళనాడు సీఎం విజయ్

# ఢిల్లీ పర్యటనలో ట్విస్ట్

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

తమిళనాడులో దశాబ్దాల తర్వాత ఏర్పాటైన మొదటి సంకీర్ణ ప్రభుత్వ ముఖ్యమంత్రిగా.. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ సంచలనం సృష్టించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే సీఎంగా మారిన తర్వాత ఆయన తొలిసారిగా దేశ రాజధాని ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం ఢిల్లీ చేరుకున్న ఆయన.. తమిళనాడు రాష్ట్ర ప్రయోజనాలే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వ పెద్దలతో వరుస సమావేశాలు నిర్వహించారు. అయితే గురువారం ఉదయం కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో కూడా భేటీ జరగాల్సి ఉండగా.. ఉన్నట్టుండి ఈ సమావేశం వాయిదా పడింది. ఉదయం 10 గంటలకే వీరంతా కలవాల్సి ఉండగా.. కొన్ని అనివార్య కారణాలతో కలవలేకపోయారు.



**కాంగ్రెస్ నేతలతో భేటీ వాయిదా వెనుక కారణమిదేనా?**

రాష్ట్రంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం), వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల మద్దతుతో టీవీకే సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతోంది. ఈ నేపథ్యంలోనే మిత్రపక్షమైన కాంగ్రెస్ అధినేతలు సోనియా, రాహుల్ గాంధీలతో గురువారం ఉదయం 10 గంటలకు జరగాల్సిన భేటీ బుధవారం రాత్రి హఠాత్తుగా వాయిదా పడింది. దీనికి గల స్పష్టమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. అయితే కేవలం షెడ్యూల్ మార్పుల వల్లే ఈ నిర్ణయం జరిగిందని, వచ్చే వారం ఈ భేటీ ఖచ్చితంగా ఉంటుందని పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి.

**ప్రధాని మోదీతో విజయ్ భేటీ.. మూడు కీలక అంశాలపై చర్చ!**

ముఖ్యమంత్రి విజయ్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు సున్నితమైన, దీర్ఘకాలిక సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ఈ భేటీలో మూడు అంశాలపై విస్తృతంగా చర్చించారు. కావేరి నదిపై మేకేదాటు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు భూమి పూజకు కర్ణాటక ప్రభుత్వం సిద్ధమవ్వడంపై విజయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్య కావేరీ జలాల వివాద ట్రిబ్యునల్ (సీడబ్ల్యూడీటీ) తుది తీర్పుకు, సుప్రీంకోర్టు ఆదేశాలకు పూర్తిగా విరుద్ధమని ప్రధానికి వివరించారు. దీనివల్ల తమిళనాడు రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు.

అంతేకాకుండా శ్రీలంక నౌకాదళం తమిళ మత్స్యకారుల వేధింపులకు పాల్పడుతూ, తరచూ అరెస్టులు చేస్తోందని ప్రధానికి విజయ్ నివేదించారు. ప్రస్తుత ఏడాదిలోనే 12 దఫాలుగా మత్స్యకారులను అరెస్ట్ చేశారని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు లంక జైళ్లలో ఉండగా.. వారి 266 పడవలను స్వాధీనం చేసుకున్నారని గుర్తు చేశారు. అంతేకాకుండా వీరి విడుదలకు కేంద్రం తక్షణమే చొరవ చూపాలని కోరారు. ఇది మాత్రమే కాకుండా తన ప్రమాణ స్వీకార ఉత్సవంలో వందేమాతరం, జాతీయ గీతం తర్వాత మూడో స్థానంలో తమిళ ప్రార్థనా గీతాన్ని ఆలపించడంపై చెలరేగిన వివాదంపై ప్రధానికి విజయ్ ఒక లేఖను సమర్పించారు. దేశ ఐక్యతకు, రాజ్యాంగ విలువల పట్ల తమిళనాడు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, అయితే రాష్ట్ర ప్రజా జీవితంలో 'తమిళ తాయ్ వాజ్తు' గీతానికి ఉన్న శతాబ్దాల నాటి ప్రాధాన్యతను గౌరవించాలని కోరారు.

**ఆర్థిక మంత్రి సీతారామన్‌కు అభివృద్ధి మెమొరాండం..**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిగిన భేటీలో సీఎం విజయ్ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన నిధుల విడుదలపై ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. తమిళనాడు ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచే ఈరోడ్, కోయంబత్తూర్, మదురై వంటి ప్రధాన నగరాల్లో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ మెరుగుపరిచేందుకు మెట్రో రైల్ ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక మద్దతు ఇవ్వాలని కోరారు. వీటితో పాటు జాతీయ రహదారులు, ఓడరేవులు, రైల్వే ప్రాజెక్టులు, పారిశ్రామిక కారిడార్ల నిధులను వేగవంతం చేయాలని మెమొరాండం సమర్పించారు.

---

# నేను బాధ్యత తీసుకుంటున్నా

## - ధర్మేంద్ర ప్రధాన్ కామెంట్
## - సీబీఎస్ఈ ఓఎస్ఎం వివాదం

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) పద్ధతిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధానం కారణంగానే తమ సమాధాన పత్రాలు తారుమారయ్యాయని కొందరు విద్యార్థులు ఆరోపించడంతో సీబీఎస్ఈ తీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. మూల్యాంకన ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు తేలితే.. బాధ్యులను వదిలిపెట్టబోమని విద్యార్థులు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. అలాగే ఈ వైఫల్యాలకు తాను బాధ్యత తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ''వాటిని సరిచేస్తాం. పరిష్కారాలను కనుగొంటాం'' అని దిల్లీలో సీబీఎస్ఈ అధికారులతో నిర్వహించిన సమావేశం అనంతరం ప్రధాన్ మీడియాకు తెలిపారు.



''98 లక్షల సమాధాన పత్రాల కాపీలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాం. ఒక్కో సమాధాన పత్రంలో 40 పేజీలు ఉంటాయి. ఆ లెక్కన 40 కోట్ల కాపీలను స్కాన్ చేశాం. ఆన్‌స్క్రీన్ మార్కింగ్ సిస్టమ్ అనేది ఒక ముందడుగు. ఇప్పటికే అంతర్జాతీయంగా దీనిని వినియోగిస్తున్నారు. ఇది విద్యార్థుల కోసం తీసుకువచ్చింది. వారి మార్కుల గురించి పారదర్శక సమాచారం అందించేలా దీనిని ఏర్పాటు చేశాం'' అని మంత్రి వివరించారు. డిజిటల్ ఇండియా, శాస్త్రీయ పురోగతికి సంబంధించిన వ్యవస్థలను కొందరు పదేపదే వ్యతిరేకిస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ప్రధాన్ విమర్శలు చేశారు. ''రాజకీయాలు తర్వాత చేయొచ్చు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరగకుండా చూడటమే ఇప్పుడు ముఖ్యమైన విషయం. ఇప్పటికే మార్కులు, వెరిఫికేషన్, రీ వ్యాల్యుయేషన్ వంటి వాటితో ఆందోళనకు గురవుతున్న విద్యార్థులపై మరింత ఒత్తిడి పెంచేలా బహిరంగ ప్రకటనలు చేయొద్దు'' అని అన్ని వర్గాలను కోరారు.

**స్పందించిన సీబీఎస్ఈ..**

ఓఎస్ఎం విధానంపై సీబీఎస్ఈ స్పందించింది. ఇది సురక్షితమైన ఐటీ ప్లాట్‌ఫామ్ అని పేర్కొంది. మూల్యాంకన పోర్టల్‌లో ఎలాంటి లోపాలు బయటపడలేదని తెలిపింది. సమాధాన పత్రాల స్కానింగ్, ప్రాసెసింగ్‌కు పటిష్టమైన డిజిటల్ వ్యవస్థ ఉందని పేర్కొంది.

**ఏంటీ 'ఓఎస్ఎం' వివాదం..?**

మే 13వ తేదీన సీబీఎస్ఈ బోర్డు 12వ తరగతి పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. ఇందులో ఉత్తీర్ణత గతేడాదితో పోలిస్తే 3 శాతం తగ్గింది. అయితే, ఈ ఏడాది జవాబు పత్రాల మూల్యాంకనం కోసం కొత్తగా తీసుకొచ్చిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) వల్లే తమకు తక్కువ మార్కులు వచ్చాయని కొంతమంది విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో స్పందించిన బోర్డు.. విద్యార్థులకు జవాబు పత్రాల స్కానింగ్ కాపీలను అందిస్తామని తెలిపింది. దాన్ని సరిచూసుకొని పునర్‌మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. అయితే, ఈ పత్రాలు తారుమారయ్యాయని కొందరు విద్యార్థుల నుంచి ఫిర్యాదులొచ్చాయి. పునర్‌మూల్యాంకన ప్రక్రియలో భాగంగా సీబీఎస్ఈ అప్‌లోడ్ చేసిన భౌతికశాస్త్ర సమాధానపత్రం తనది కాదని దిల్లీకి చెందిన వేదాంత్ అనే విద్యార్థి ఆరోపించారు. సంజన అనే 12వ తరగతి విద్యార్థిని కూడా తన రసాయనశాస్త్ర సమాధాన పత్రం తారుమారైందని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన బోర్డు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది.

---

# రాత్రి 7:30 గంటల దాకా

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న జోరుకు అనుగుణంగా భూమి, రిజిస్ట్రేషన్ విలువలను సవరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుండి భూ లావాదేవీల రిజిస్ట్రేషన్ల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద భారీ రద్దీ నెలకొంది.

దీంతో తెలంగాణలో భూముల కొనుగోలు, అమ్మకాలు చేయాలనుకునే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో విపరీతమైన రద్దీని దృష్టిలో ఉంచుకుని, మే 29 నుండి జూన్ 3 వరకు అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పనివేళలను పొడిగించింది. ఇకపై ఈ నిర్ణీత రోజుల్లో ఉదయం 9:30 గంటల నుండి రాత్రి 7:30 గంటల వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగనుంది.

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం విపరీతంగా పుంజుకోవడంతో.. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న అసలు ధరలకు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఈ వ్యత్యాసాన్ని సరిచేయడానికి, భూముల ప్రభుత్వ విలువలను (మార్కెట్ విలువలను) సవరించాలని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే భూముల విలువలు పెరుగుతాయనే ప్రచారంతో, పెరిగిన ధరల భారం పడకుండా ఉండేందుకు ప్రజలు ముందే రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు పోటెత్తుతున్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సవరించిన పనివేళల గురించి అధికారిక ప్రకటన చేశారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే సాధారణ ప్రజలు గంటల తరబడి లైన్లలో నిలబడి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా ప్రతిరోజూ కేటాయించే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ స్లాట్ల సంఖ్యను కూడా పెంచాలని అధికారులను ఆదేశించారు. అగ్రికల్చర్ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా, సంబంధిత శాఖల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. మీ వద్ద భూమి, ప్లాట్ లేదా ఇళ్ల రిజిస్ట్రేషన్ పనులు పెండింగ్‌లో ఉంటే, ఈ పొడిగించిన సమయాన్ని (రాత్రి 7:30 వరకు) ఉపయోగించుకోవచ్చు. జూన్ 3 తర్వాత రిజిస్ట్రేషన్ విలువలు పెరిగే అవకాశం ఉన్నందున, ముందే స్లాట్ బుక్ చేసుకోవడం ఉత్తమం. ఈ నిర్ణయం వల్ల రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై ఒత్తిడి తగ్గడమే కాకుండా, ప్రజలు ప్రశాంతంగా తమ రిజిస్ట్రేషన్ పనులు ముగించుకోవడానికి వీలవుతుంది.







# ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

**నిజాంపేట్, మే 28 (సిటీటైమ్స్):**

నవరస నటసార్వభౌముడు , సమైక్య ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పేదల పాలిట పెన్నిధిగా పేరు గాంచిన, ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం పోరాటం చేసిన డాక్టర్ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి వేడుకలు నిజాంపేట్ పరిధిలోని ప్రగతినగర్ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నాగరాజు చౌదరీ, రవికిరణ్ వాకలపూడికి నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకల్లో వందలాది మంది ఎన్టీఆర్ అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముఖ్యంగా లీడర్ నరసింహ రెడ్డి, కాసాని వీరేష్, మేకల వెంకటేష్, మాజీ కార్పొరేటర్లు తదితరులు హాజరై ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే మహానేత అని పలువురు నేతలు కొనియాడారు.

# ఎన్టీఆర్ ఆశయాలే ప్రజాసేవకు మార్గదర్శకం: ఆరికెపూడి గాంధీ





- శేరిలింగంపల్లి వ్యాప్తంగా ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు
- వివేకానందనగర్ నుంచి ప్రగతినగర్ వరకు విగ్రహాలకు నివాళులు
- ఎన్టీఆర్ సేవలను స్మరించుకుంటూ రక్తదాన శిబిరం నిర్వహణ
- బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించిన మహానేత అని కొనియాడిన గాంధీ

**శేరిలింగంపల్లి, మే 28 (సిటీటైమ్స్):**

తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు 103వ జయంతిని శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వివేకానందనగర్, హైదర్‌నగర్, భాగ్యనగర్ కాలనీ, ఎల్లమ్మబండ, ప్రగతినగర్, దీప్తి శ్రీనగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ ఘన నివాళులర్పించారు. పలుచోట్ల కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు.

వివేకానందనగర్ కాలనీ, త్రివేణి సర్కిల్, భాగ్యనగర్ కాలనీ, ఎల్లమ్మబంద, ప్రగతినగర్, దీప్తి శ్రీనగర్ ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డితో కలిసి ఆరికెపూడి గాంధీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ కేవలం నాయకుడు మాత్రమే కాదని, తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానుభావుడని కొనియాడారు. "సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు" అనే నినాదంతో రాజకీయాలకు కొత్త అర్థం చెప్పిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని అన్నారు. పార్టీ స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని కైవసం చేసుకుని రాజకీయ చరిత్రనే మార్చేశారని గుర్తుచేశారు.

బడుగు బలహీన వర్గాలు, యువతకు రాజకీయ అవకాశాలు కల్పించి కొత్త అధ్యాయానికి నాంది పలికారని పేర్కొన్నారు. పేదవాడి జీవనోపాధికి అవసరమైన తిండి, గూడు, బట్ట అందించాలనే లక్ష్యంతో సంక్షేమ పాలన అందించిన మహానేత అని కొనియాడారు. పటేల్‌పట్వారీ వ్యవస్థను రద్దు చేయడం, మహిళలకు ఆస్తి హక్కులు కల్పించడం, మహిళా సాధికారత కోసం రిజర్వేషన్లు తీసుకురావడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు.



తెలుగువాడి కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని, ఆయన ఆశయాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని గాంధీ పేర్కొన్నారు. రాజకీయాల్లో ప్రజాసేవకు, సామాజిక న్యాయానికి ఎన్టీఆర్ మార్గదర్శకుడని కొనియాడారు.

దీప్తి శ్రీనగర్ కాలనీలో ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరంలో కూడా ఆరికెపూడి గాంధీ పాల్గొన్నారు. రక్తదానం మహాదానం అని, తలసేమియా చిన్నారులు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన దాతలను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమాల్లో నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఆశయాలు చిరస్మరణీయం: జగదీశ్వర్ గౌడ్

- దీప్తి శ్రీనగర్‌లో ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు
- అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జ్

**శేరిలింగంపల్లి, మే 28 (సిటీటైమ్స్):**

తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా దీప్తి శ్రీనగర్ కాలనీలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. రాజకీయాల్లో ఆత్మగౌరవానికి కొత్త నిర్వచనం ఇచ్చి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన అందించిన మహానేతగా ఎన్టీఆర్ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, మహిళలు, ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, మే 28 (సిటీ టైమ్స్):**

మాజీ ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ గురువారం ఐడిపిఎల్ చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చాటిన మహనీయుడని కొనియాడారు. రాజకీయాల్లో ప్రజా సేవకు కొత్త దారులు చూపిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. అదేవిధంగా సినీ రంగంలో తన అద్భుత నటనతో కోట్లాది అభిమానులను సంపాదించుకుని తెలుగు సినీ చరిత్రలో చిరస్మరణీయ వ్యక్తిగా నిలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జై రామ్, రంగారావు, కూన రాఘవేందర్ గౌడ్, మోటే శ్రీనివాస్ యాదవ్, గడ్డం రాజేందర్ రెడ్డి, రవి, దిలీప్, శంకరయ్య, రవీందర్ గుప్తా, మల్లం శీను, శంకర్ గౌడ్, తోకల శీను, శ్రీకాంత్, చోటు ఓంకార్, శివ, సురేందర్, క్రాంతి తదితరులతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: వి. జగదీశ్వర్ గౌడ్



- ఆదిత్యనగర్, భిక్షపతినగర్ ఈద్గాల్లో బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జ్
- ముస్లిం సోదరులకు పర్వదిన శుభాకాంక్షలు
- అన్ని మతాలను సమానంగా చూసే నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అని వ్యాఖ్య

**శేరిలింగంపల్లి, మే 28 (సిటీటైమ్స్):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తోందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మాతృశ్రీనగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్, భిక్షపతినగర్ ఈద్గాల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ త్యాగానికి, మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో ప్రేమ, సౌభ్రాతృత్వం, మత సామరస్యాన్ని పెంపొందించే గొప్ప పండుగగా బక్రీద్ నిలుస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను సమాన దృష్టితో చూస్తూ సంక్షేమ ఫలాలు అందిస్తోందని చెప్పారు. పేద ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో సెక్యులర్ పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. అన్ని కులాలు, మతాలను సమాన భావంతో చూసే నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు, ప్రజలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే పెండింగ్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల విడుదల

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ (హరిత ఇంధనం) ప్రోత్సాహానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గురువారం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గార్లపాడు గ్రామంలో ఆయన సోలార్ పవర్ ప్లాంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులను అందుబాటులోకి తెస్తున్నామని, ఇందులో భాగంగా వ్యవసాయ మోటార్ల కోసం 7.5 కిలోవాట్ల సోలార్ యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

పైలట్ ప్రాజెక్ట్ కింద బోనకల్, కొడంగల్ మండలాల్లో పూర్తిస్థాయిలో ఈ సౌర యూనిట్లను అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం వివరించారు. రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్‌ను అందిస్తున్నామని భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన 9,214 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకున్నామని ఆయన గుర్తుచేశారు. రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొంటుందని భరోసా ఇచ్చారు. విద్యార్థులకు కూడా ఆయన ఒక తీపి కబురు అందించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను త్వరలోనే విడుదల చేస్తామని, ఇందుకు సంబంధించి ఆయా శాఖలకు ఇప్పటికే అనుమతులు మంజూరు చేశామని డిప్యూటీ సీఎం వెల్లడించారు.

# తమిళ తీర్పు కనువిప్పు అయ్యేనా?

ఆంధ్రప్రదేశ్‌లో ఒక నాయకుడు తన నియోజకవర్గంలో ఇంటింటికీ రకరకాల కానుకలు పంపించేవాడు. ప్రతి సందర్భంలోనూ స్వీట్లు, తినుబండారాలు, పండుగల సమయంలో మగవారికి రేమాండ్ దుస్తులు, మహిళలకు పట్టు చీరలు పంపిణీ చేసేవాడు. పెళ్లయిన ప్రతి జంటకూ బంగారు తాళిబొట్లు, పట్టు వస్త్రాలు, వెండిమెట్టెలు బహూకరించేవాడు. ఇక ఎన్నికల సమయంలోనైతే సరే సరి. ఒక ట్రక్కునే ప్రత్యేకంగా ఉపయోగించి డబ్బును విచ్చలవిడిగా పంచిపెట్టారని వార్తలు వచ్చాయి. అయితేనేం గత ఎన్నికల్లో ఆయన 43వేల ఓట్లకు పైగా తేడాతో పరాజయం పాలయ్యారు.

ప్రజలు తలుచుకుంటే తమను ఎవరు ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా సరే వారు లొంగిపోయే అవకాశాలు లేవని చెప్పేందుకు ఈ ఒక్క ఉదాహరణ చాలు. ఈ విషయం తెలిసినప్పటికీ దేశంలో రాజకీయ పార్టీలు, నాయకులు ప్రజలను ప్రలోభపెట్టేందుకు, ఓట్లను కొనుగోలు చేసేందుకు నానా యత్నాలు చేస్తుంటారు. దీని వల్ల ప్రజల దృష్టిలో రాజకీయ నాయకుల పట్ల ఏహ్య భావం ఏర్పడడడం మినహా మరేదీ జరగదు. నాయకులు తమ ఓట్లను కొనుగోలు చేస్తున్నారంటే, వారు రాజకీయాల్లో ఉండి ఎంత సంపాదిస్తున్నారో, ఎంత ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారో అన్న సందేహాలు ప్రజలకు తప్పక ఏర్పడుతుంది. ఇదంతా మనను దోచుకున్న సొమ్మే కదా.. అన్న అభిప్రాయం చాలా మందిలో ఉన్నది.

ఇటీవల తమిళనాడులో డీఎంకే, అన్నాడీఎంకే భారీ ఎత్తున డబ్బులు పంచిపెట్టాయి. ప్రతి నియోజకవర్గానికీ రూ.20 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు పంచిపెట్టారన్నది ఒక అంచనా. రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు కవర్లలో డబ్బులు ఉంచి ఈ పార్టీలు నగదును పంచిపెడుతున్న దృశ్యాలను సోషల్ మీడియాలో ప్రసారం చేసినా సరే ఎన్నికల కమిషన్ పెద్దగా పట్టించుకోలేదు. భారీ ఎత్తున డబ్బు పంచిపెడుతున్నారని 'అరప్పోర్ ఇయ్యాక్కమ్' అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు కూడా చేసింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే తమకు ఏ మాత్రం డబ్బులు పంచిపెట్టని సినీనటుడు విజయ్ పార్టీ టీవీకే అభ్యర్థులను అత్యధిక సంఖ్యలో గెలిపించారు. ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సహా 15 మంది డీఎంకే మంత్రులు మట్టికరిచారు. నాలుగు సార్లు మంత్రిగా పనిచేసిన ఒక డీఎంకే నేతను ఒక ఆటో డ్రైవర్ ఓడించాడు. మరోచోట ఒక కారు డ్రైవర్ కొడుకు గెలిచాడు. చాలా చోట్ల భారీ ఆధిక్యతతో విజయం సాధించిన టీవీకె అభ్యర్థులు కనీసం 20 నియోజకవర్గాల్లో అతి స్వల్ప తేడాతో ఓడిపోయారు. ధనబలం లేకుండా ఎన్నికలు జరిగి ఉంటే విజయ్ ప్రభంజనం వీచేదని ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

ఇటీవలి కాలపు ప్రజాస్వామ్య చరిత్రలో ఒక రాష్ట్రంలో ప్రజల నుంచి ఓట్లు కొనుగోలు చేయకుండా గెలిచిన ఘనత విజయ్‌కి దక్కింది. విజయ్ నిజానికి రాష్ట్రమంతటా ప్రచారం చేయలేదు. చాలా చోట్ల ఆయన కటౌట్లు, హోలోగ్రామ్‌లు, డూప్‌లతో ప్రచారం చేయించారు. కరూర్‌లో జరిగిన తొక్కిసలాటను దృష్టిలో ఉంచుకుని ఆయన చాలా ర్యాలీలు రద్దు చేసుకున్నారు. టీవీకే అభ్యర్థులు కూడా చాలా చోట్ల పెద్దగా ప్రచారం చేయనేలేదు. కొన్ని చోట్ల డీఎంకే, అన్నాడీఎంకే అభ్యర్థులు వారికి డబ్బులు ఇచ్చి ఇంట్లో విశ్రాంతి తీసుకొమ్మని చెప్పారని సమాచారం. చాలా నియోజకవర్గాల్లో కౌంటింగ్ కేంద్రాలకు కూడా టీవీకే అభ్యర్థులు వెళ్లలేదు. తాము గెలిచామని టీవీ ప్రసారాలలో తెలుసుకుని ఆశ్చర్యపోయారు. విజయ్ సభలకు భారీ ఎత్తున జనం హాజరైనప్పటికీ పార్టీ యంత్రాంగం లేకపోవడం, స్థానిక సమీకరణ సరిగా జరగకపోవడం, నిధుల కొరత, అనుభవం లేని అనామక అభ్యర్థులతో టీవీకే విజయం సాధించడం కష్టమని చాలా మంది భావించారు. అనేక నియోజకవర్గాల్లో చిన్న వ్యాను, రెండు ఆటోరిక్షాలు, కొద్ది మంది పిల్లలు ఈలలు వేస్తూ ముందు వెళుతుండగా అభ్యర్థులు ప్రచారం సాగించారు. చాలా చోట్ల విద్యార్థులు, మహిళలే ఇంటింటికి వెళ్లి స్వచ్ఛందంగా ప్రచారం చేశారు. ప్రచారానికి చిన్నమొత్తాల్లో చందాలు సేకరించారు. కొన్ని నియోజకవర్గాల్లో టీవీకే పోస్టర్లు కూడా లేవు. టీవీకే అభ్యర్థులు రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్లినా వారిని జనం గుర్తు పట్టేవారు కాదు.

తమిళనాడు ఎన్నికలు పార్టీలు ధనబలంతో, కండబలంతో, వ్యవస్థలను తమకు అనుకూలంగా మార్చుకుని అధికారంలోకి రావాలని చూసేవారికి గుణపాఠం కావాలి. ఎన్నికల బాండ్ల పేరుతో కార్పొరేట్ సంస్థల నుంచి నిధులు సేకరించడం, నిధులు ఇచ్చిన వారికి రాజ్యసభ సీట్లు కేటాయించడం, చివరకు వారి సంస్థలను ప్రారంభించడం వంటి తిప్పలు పడేవారికి కనువిప్పు కలిగించాలి. అక్రమంగా నిధులు ఇచ్చిన కార్పొరేట్ సంస్థలకు క్విడ్ ప్రోకోగా ప్రాజెక్టులు కేటాయించాల్సి రావడం, ఆ ప్రాజెక్టుల్లో అవకతవకల్ని విస్మరించడం, ఓట్లు కొనుగోలు చేసినవారు మళ్లీ ఆ నష్టం భర్తీ చేసేందుకు మళ్లీ అవినీతికి పాల్పడడం వంటి దుర్లక్షణాల ద్వారా మొత్తం వ్యవస్థలు భ్రష్టుపట్టిపోయాయి భారత రాజకీయ, అధికార వ్యవస్థలో ఈ ఎన్నికల అవినీతి కీలక పాత్ర పోషిస్తోంది.

# చేలకు చేరని సేద్య పరిశోధనలు

పర్యావరణ మార్పులను తట్టుకుంటూ ఆహార భద్రతకు భరోసా కల్పించగలిగే రెండు కొత్త వరి రకాలను భారతీయ వ్యవసాయ శాస్త్రవేత్తలు నిరుడు సృష్టించారు. పాత వరి రకాల జన్యువులను సవరించడం (జీనోమ్ ఎడిటింగ్) ద్వారా మన పరిశోధకులు దీన్ని సాధించగలిగారు. తాజాగా ప్రపంచ సాగు రంగంలోనే తొలిసారి కృత్రిమమేధ ఆధారిత జీనోమ్ ఎడిటింగ్ టూల్‌ను భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐకార్) శాస్త్రజ్ఞులు ఆవిష్కరించారు. రైతాంగానికి లాభదాయకమైన జన్యుసవరణ ప్రక్రియను చవగ్గా పూర్తిచేయడానికి ఇది బాగా అక్కరకొస్తుందని అంటున్నారు. ఇలాంటి అరుదైన విజయాలు దేశానికి గర్వకారణమైనవే కానీ, వాటి ప్రచార ఉద్ధృతిలో వాస్తవిక సమస్యల తీవ్రత మరుగున పడిపోతోంది. ముఖ్యంగా కీలక వ్యవసాయ పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, కృషివిజ్ఞాన కేంద్రాలలో అనేకం 'ఆకారం పుష్టి...' అన్నట్లుగా తయారవ్వడంతో నవీన సేద్య సాంకేతికతలు, అధునాతన వంగడాల సమాచారం పొలాల వరకు



చేరడంలో అంతులేని జాప్యం జరుగుతోంది. దాంతో తమకు తెలిసిన సంప్రదాయ సాగు పద్ధతులనే అనుసరిస్తూ ఏటా నష్టాలనే మూటగట్టుకుంటున్న సామాన్య రైతులలో పలువురు అనివార్యంగా కాడివదిలేయాల్సి వస్తోంది!

పుణెలోని జాతీయ ద్రాక్ష పరిశోధన కేంద్రాన్ని ఇటీవల తనిఖీచేసిన కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు విభ్రాంతికర అనుభవం ఎదురైంది. అక్కడి నర్సరీలో దట్టంగా గడ్డి పెరిగి ఉండటం; చీడపీడల నివారణకు, వినూత్న వంగడాల సృష్టికి ఏంచేస్తున్నారని అడిగితే ఆ కేంద్రం బాధ్యులు నీళ్లునమలడం చూసి విస్తుపోవడం అమాత్యుల వంతైంది. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంజేసిన శివరాజ్‌సింగ్ 'ఐకార్' పరిధిలోని మొత్తం 113 పరిశోధనా కేంద్రాల తీరుతెన్నులపై సమగ్ర సమీక్షకు ఆదేశించారు. ఆయా కేంద్రాల పనితీరును కూలంకషంగా పరిశీలించి, తక్షణం వ్యవస్థాగత ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరాన్ని మంత్రి గుర్తుచేశారు. నిస్సార నేలల్లో అధిక దిగుబడులు సాధించలేక నీరసించిపోతూ... అనూహ్య ప్రకృతి విపత్తులు, తెగుళ్ల ధాటికి చితికిపోతున్న సాగుదారుల చెంతకు సేద్య విజ్ఞానఫలాలను చేర్చి, వారి ఆదాయాలను పెంపొందించాలంటే శివరాజ్‌సింగ్ ప్రస్తావించిన సంస్కరణలు అత్యావశ్యకమే! సాగు పరిశోధనలకు రూపాయి ఖర్చుచేస్తే పద్నాలుగు రూపాయలు తిరిగివస్తాయన్నది నిపుణుల సూచన. ఆ మేరకు వ్యవసాయ ఆర్అండ్‌డీకి నిధుల కేటాయింపులోనూ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరిస్తే దాదాపు 47శాతం దేశ జనాభాకు జీవనోపాధి కల్పిస్తున్న సాగు రంగం సంక్షోభ సుడిగుండంలోంచి బయటపడగలదు!

దేశీయంగా 200523 మధ్యలో అధిక దిగుబడులనిచ్చే 3504 వంగడాలను విడుదలచేశామని 'ఐకార్' వర్గాలు ఘనంగా సెలవిస్తున్నాయి. కానీ వరి, గోధుమ, మొక్కజొన్న లాంటి పంటల్లో చైనా, అమెరికా తదితరాలు ఎకరానికి సగటున సాధిస్తున్న ఫలసాయాలతో పోలిస్తే దేశీయంగా రైతుల చేతికొస్తున్నవి చాలా తక్కువ! ఆ రెండు దేశాలతో పాటు దక్షిణకొరియా, ఇజ్రాయెల్ వంటివి వ్యవసాయ ఆర్అండ్‌డీకి తమ జీడీపీలో 2.6శాతం నుంచి ఆరుశాతం నిధులను వెచ్చిస్తుంటే మన దేశంలో మాత్రం ఆ మొత్తం ఒక్కశాతం కంటే దిగువకే పరిమితమవుతోంది. స్థానికంగా అభివృద్ధి చేశామంటున్న కొత్త వంగడాల పరిశోధనా రికార్డులు లభ్యంగా లేని సంగతి కొన్నిచోట్ల ఆడిట్‌లలో బయటపడుతుండటం మన దగ్గర మేటవేసిన అవ్యవస్థకు ప్రబల తార్కాణం! దీన్ని సరిచేయడమెంత అవసరమో రసాయన ఎరువులు, క్రిమిసంహారకాల విచ్చలవిడి వాడకాన్ని నిరోధించడమూ అంతే ప్రధానం! ఆ మేరకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు గ్రామాల్లో విరివిగా పర్యటిస్తూ రైతులోకాన్ని జాగృతపరిచేవిధంగా ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేయాల్సింది ప్రభుత్వాలే!

# తీరికూర్చుని త్రిభాషా సూత్రం

దేశంలో హిందీ భాషకు ఆధిపత్య స్థానం కల్పించాలనుకుంటున్న ప్రతిసారీ దక్షిణాదిలో... ముఖ్యంగా తమిళనాడులో వివాదం తలెత్తుతుండగా కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) కొత్త ఎత్తుగడతో ఆ భాషను ప్రతిష్ఠించదల్చుకున్నట్టు కనబడుతోంది. అందువల్లే శుక్రవారంనాటి ఆ సంస్థ మార్గదర్శకాలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. జాతీయ విద్యావిధానం–2020కి అనుగుణంగా జారీ చేసినట్టు చెబుతున్న ఈ మార్గదర్శకాల ప్రకారం ఇకపై విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవడం తప్పనిసరి. అందులో ఒకటి విదేశీ భాష. మిగిలిన రెండూ 'స్థానిక భాషలు'. త్రిభాషా సూత్రంగా పిలిచే ఈ విధానం వాస్తవానికి కొఠారీ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా రూపొందిన జాతీయ విద్యావిధానం–1968 నాటిదే. కేంద్రంలో ఏ పార్టీ లేదా కూటమి అధికారంలో ఉన్నా ఏదోవంకన హిందీని తీసుకొచ్చే ప్రయత్నం చేయటం రివాజైంది. ఉభయ తెలుగు రాష్ట్రాలతోసహా చాలా రాష్ట్రాలు త్రిభాషా సూత్రాన్ని అనుసరిస్తున్నా, తమిళనాడు మాత్రం తమిళంతోపాటు ఇంగ్లిష్ బోధన ఉండే ద్విభాషా



సూత్రానికే కట్టుబడి ఉంది. విద్యార్థి దశలో వివిధ భాషలపట్ల ఆసక్తి, అనురక్తి పెంచి ప్రోత్సహించటంలో తప్పేం లేదు. కానీ ఆ వంకన ఒక భాష ఆధిపత్యాన్ని నెలకొల్పుదామనుకోవటమే సమస్య. ఇప్పటికైతే తల్లిదండ్రులు విద్యాసంవత్సరం మొదలై రెండునెలలు గడిచాక హఠాత్తుగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. పునరాలోచన చేయకుంటే ఇది భాషా వివాదంగా మారినా మారొచ్చు.

వచ్చే జూలైనుంచి అమల్లోకి రాబోతున్న ఈ విధానం సమస్యాత్మకమైనది. అన్నిటా ఇప్పటికే భాగంగా మారిన ఇంగ్లిష్‌ను ఇది 'విదేశీ భాష' గా గుర్తిస్తోంది. మన ప్రభుత్వాల ఉత్తరప్రత్యుత్తరాలు, జీవోలు, చట్టాలు... అన్నీ ఇంగ్లిష్‌లో ఉంటాయి. న్యాయస్థానాల్లో వాదప్రతివాదాలు మొదలుకొని తీర్పులవరకూ దాని వాడకం విస్తృతం. ఇక ఐఐటీ, ఐఐఎంలాంటి ఉన్నతశ్రేణి సంస్థల్లో చెప్పనవసరం లేదు. ఉన్నత చదువులకైనా, ఉద్యోగావకాశాలకైనా అదొక తప్పనిసరి అవసరం. ఈ దశలో ఇంగ్లిష్‌ను 'విదేశీభాష'గా గుర్తించటం వల్ల మన విద్యార్థులు జర్మన్, ఫ్రెంచ్, జాపనీస్, కొరియన్ వంటి భాషలు నేర్చుకొనే అవకాశాన్నికోల్పోతారు. ప్రపంచవ్యాప్తంగావున్న తీవ్ర పోటీ పర్యవసానంగా ఉద్యోగార్థులు వారి వారి రంగాల్లో నైపుణ్యం సాధిస్తే సరిపోదు. ఇంటర్వ్యూల్లో దాన్ని సమర్థ వంతంగా వ్యక్తం చేయగలగాలి. ఏ ఉత్పత్తికైనా ప్రపంచవ్యాప్త మార్కెట్ ఏర్పడిన వర్తమానంలో ఇంగ్లిష్‌తోపాటు మరో విదేశీ భాష వస్తేనే ప్రాముఖ్యత. కానీ సీబీఎస్ఈ తీరుతో ఇంగ్లిష్ విడనాడితేనే మరో విదేశీ భాష సాధ్యం.

ఉత్తరాదిన త్రిభాషా సూత్రం ఎంచక్కా అమలవుతోంది. వారు హిందీతోపాటు సంస్కృతాన్ని 'స్థానిక భాష'గా నేర్చుకుంటారు. 'విదేశీ భాష'గా ఇంగ్లిష్ ఉండనే ఉంది! దక్షిణాదిన మాత్రం స్థానిక భాషతోపాటు ఎంచుకోవటానికి హిందీ లేదా సంస్కృతం ఉంటాయి. సినిమాల ప్రభావంవల్ల సహజంగా అత్యధికులు హిందీని ఎంచుకుంటారు. దక్షిణాది రాష్ట్రాలు హిందీకి దాదాపు అలవాటుపడినట్టే... అటువైపువారు సైతం తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం, ఒరియావంటి భాషల్లో ఏదో ఒకటి నేర్చుకోవటం తప్పనిసరి చేస్తే వివక్ష కనబడేది కాదు. పైగా ఇటువైపువారికి ఉత్తరాదిన ఉద్యోగావకాశాలు లభించేవి. కానీ ఆ పని చేయరు.

తొమ్మిదో తరగతికి వర్తింపజేస్తూ తీసుకొచ్చిన ఈ నిర్ణయం తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తోంది. 6 నుంచి 8వ తరగతి వరకూ వేరే విధంగా చదివినవారు ఇప్పుడు హఠాత్తుగా సంస్కృతమో, హిందీయో నేర్చుకుతీరాలి. అసలు పాఠ్యపుస్తకాలే లేని ప్రస్తుత స్థితిలో, కీలక మలుపు అనదగిన పదో తరగతినాటికి పిల్లలంతా ఆ భాషల్లో ప్రావీణ్యత సాధించటం సాధ్యమేనా? ఇప్పటికే ఒక యూనిట్ టెస్ట్ కూడా పూర్తయింది. 'ప్రస్తుతానికి' తొమ్మిదో తరగతివారికి ఆరో తరగతి పాఠ్యపుస్తకం వినియోగించాలనీ, టీచర్లుండరు గనుక రిటైరైనవారి సేవలను వినియోగించుకోవాలనీ సీబీఎస్ఈ చెబుతోంది. 'ఎలా రాసినా...' ఆ మార్కుల్ని పట్టించుకోబోమన్న సన్నాయి నొక్కులు అదనం. కానీ అన్నిటా 90 శాతంపైగా సాధించిన విద్యార్థి మార్కుల జాబితాలో ఇదొక దిష్టిచుక్కగా మిగలదా? సీబీఎస్ఈ ఇంతకూ ఏం సాధించదల్చుకుంది? ఇప్పటికైనా తెలివి తెచ్చుకుని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

# కొత్త ప్రపంచానికి భారత్ ఇటలీ బాట

భారత్–ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు కీలక మలుపులో నిలిచిన తరుణమిది. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, భవిష్యత్తుపై సంయుక్త ఆశావహ దృక్పథం ప్రాతిపదికన ఇటీవలి కాలంలో ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా అవి రూపాంతరం చెందాయి. అంతర్జాతీయ వ్యవస్థ ప్రగాఢ మార్పులకు లోనవుతున్న ప్రస్తుత సందర్భంలో అత్యున్నత రాజకీయ, సంస్థాగత స్థాయిలలో క్రమబద్ధ ఆదానప్రదానాలు రెండు దేశాల భాగస్వామ్యాన్ని నిర్దేశిస్తున్నాయి. ప్రస్తుత 21వ శతాబ్దంలో ఆయా దేశాల ఆవిష్కరణ సామర్థ్యం, ఇంధన పరివర్తన నిర్వహణ, వ్యూహాత్మక సార్వభౌమత్వ బలోపేతం తదితరాలు ప్రజా శ్రేయస్సు, జాతీయ భద్రత వంటి అంశాలపై ఆధారపడి ఉన్నాయి. ఈ విషయంలో మా ఉమ్మడి అవగాహనను రెండు దేశాల మధ్య సహకారం ప్రస్ఫుటం చేస్తోంది. ఈ దిశగా కొత్త పరస్పర పూరక బలాల ఏకీకరణ సహా ద్వైపాక్షిక బంధాన్ని మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దడంపై మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి సూపర్ కంప్యూటర్ల తయారీ నైపుణ్యంతో పారిశ్రామిక కూడలిగా ప్రపంచంలో ఇటలీకి ప్రముఖ స్థానం ఉంది. అదేవిధంగా 100కు పైగా యూనికార్న్ సంస్థలు సహా 2,00,000 అంకుర సంస్థలతో భారత్ శరవేగంగా ఆర్థికవృద్ధిని సాధిస్తోంది. దీంతోపాటు ఇంజనీరింగ్ ప్రతిభ–విస్తృతి, ఆవిష్కరణ–వ్యవస్థాపనావరణ వ్యవస్థలను కలిగి ఉంది. రెండు దేశాలకుగల ఈ సామర్థ్యాల మధ్య శక్తిమంతమైన సమన్వయ సాధన లక్ష్యాన్ని మేము నిర్దేశించుకున్నాం. ఇది మా పారిశ్రామిక బలాలను పరస్పరం బలోపేతం చేసుకునే విలువల వ్యవస్థను సంయుక్తంగా సృష్టిస్తుంది.

ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు ఇనుమడించేందుకు ఐరోపా సమాఖ్య-భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) బాటలు వేస్తుంది. రక్షణ-ఏరోస్పేస్, కాలుష్య రహిత సాంకేతికతలు, యంత్రాలు, ఆటోమోటివ్ విడిభాగాలు, రసాయన-ఔషధ, జౌళి, వ్యవసాయ-ఆహార, పర్యాటకం సహా మరిన్ని రంగాలపై 'ఎఫ్‌టీఏ' దృష్టి సారిస్తుంది. తద్వారా 2029 నాటికి ఇటలీ-భారత్ మధ్య నిర్దేశిత 20 బిలియన్ యూరోల వాణిజ్య లక్ష్యాన్ని చేరడంతో సరిపెట్టకుండా దాన్ని అధిగమించాలన్నది మా ఆకాంక్ష.

'మేడ్ ఇన్ ఇటలీ' అనేది అంతర్జాతీయంగా అత్యుత్తమ నాణ్యతకు పర్యాయ పదబంధం. ఇప్పుడిది 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమ నిర్దేశిత ఉన్నత నాణ్యత లక్ష్యంతో సహజ సమన్వయం ఏర్పరుచుకుంటుంది. ఈ నేపథ్యంలో భారత్ కోసం ఉత్పాదన దిశగా ఇటలీ వ్యాపార సంస్థలలో ఆసక్తి పెరుగుతోంది. మరోవైపు ఇటలీలో భారత పరిశ్రమల సంఖ్య కూడా పెరగడం (ప్రస్తుతం రెండువైపులా వీటి సంఖ్య 1000కి పైగానే) మా సరఫరా వ్యవస్థల ఏకీకరణను బలోపేతం చేసే సానుకూల సంకేతం.

మా భాగస్వామ్యానికి సాంకేతిక ఆవిష్కరణలే పునాది. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, అత్యాధునిక తయారీ, కీలక ఖనిజాలు, డిజిటల్ సదుపాయాలు వంటి రంగాల్లో నేటి పురోగమన వేగం రాబోయే దశాబ్దాల్లో సాంకేతిక విప్లవంగా రూపుదిద్దుకోగలదు. ఈ క్రమంలో చైతన్యవంతమైన భారత ఆవిష్కరణావరణ వ్యవస్థ, అత్యంత నైపుణ్యంగల వృత్తి నిపుణుల వనరులు, ఇటలీకిగల నవనవీన పారిశ్రామిక సామర్థ్యం మేళవింపుతో పైన పేర్కొన్న రంగాలన్నిటా మా సహకారం వ్యూహాత్మకంగా రూపొందుతుంది. రెండు దేశాల్లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం ఈ పరిణామశీలతకు ఇతోధికంగా తోడ్పడుతుంది. ఇక భారత సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఇప్పటికే అనేక దేశాల్లో, ముఖ్యంగా వర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో సానుకూల స్పందన లభిస్తోంది.

కృత్రిమ మేధ రంగం.. మా రెండు దేశాలతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ఇప్పటికే తనదైన ముద్ర వేసింది. ఈ ఆధునిక సాంకేతికత పురోగమనం బాధ్యతాయుతంగా, మానవాళి కేంద్రితంగా కొనసాగేలా చూడటంలో భారత్, ఇటలీ కృషి చేస్తున్నాయి. ఈ దృక్కోణంతో 'ఏఐ'ని సార్వజనీన ప్రగతికి.. ప్రత్యేకించి వర్ధమాన దేశాలకు ఒక శక్తిమంతమైన సాధనంగా మేం పరిగణిస్తున్నాం. సాంకేతికత పరిజ్ఞానాలను మానవాళి కేంద్రితంగా ఉంచేందుకు 'మానవ్' పేరిట భారత్ ఒక దార్శనిక విధానం అనుసరిస్తోంది. అదేవిధంగా మానవతావాద సంప్రదాయంలో పాదుకున్న మానవ-కేంద్రక 'అల్గార్-ఎథిక్స్'ను ప్రోత్సహించడంలో ఇటలీ ముందంజ వేసింది. ఈ రెండు దృక్కోణాలు ప్రాతిపదికగా కృత్రిమ మేధ పరిజ్ఞానం సామాజిక సాధికారతను ఉత్తేజితం చేయాలన్నది మా భాగస్వామ్యం నిర్దేశించుకున్న లక్ష్యం. ఈ దిశగా భారత డిజిటల్ స్థాయిని, ఇటలీ నైతిక- పారిశ్రామిక నైపుణ్యాన్ని మేళవిస్తూ సాంకేతిక పరిజ్ఞానం మానవాళి ఔన్నత్యానికి సేవలందించేలా భరోసా ఇవ్వడమే మా విధానం.

డిజిటల్ సహకారం, సామర్థ్య వికాసం, పటిష్ఠ సైబర్ మౌలిక సదుపాయాల కల్పనలో ఉత్తమ విధానాల ఆదానప్రదానం ద్వారా ప్రతి దేశం 'ఏఐ'ని తీర్చిదిద్దుకోవాలన్నది మా నిశ్చితాభిప్రాయం. తదనుగుణంగా ప్రయోజనం పొందగలిగే సార్వత్రిక, విశ్వసనీయ, సమాన అవకాశాలుగల డిజిటల్ ప్రపంచ సృష్టి మా ధ్యేయం. ఇటలీ జీ7 అధ్యక్షతకు, న్యూఢిల్లీలో నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సత్ఫలితాలకు మూలం ఈ సంయుక్త దృక్పథమే. కృత్రిమ మేధను మానవాళి కోసం.. మానవ మేధ సృష్టించిన ఉపకరణంగా మాత్రమే భావించాలి. అంటే- ఆధునిక సాంకేతికత వ్యక్తులకు స్థానభ్రంశం కలిగించదని లేదా వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించదని, ప్రజల వాక్స్వాతంత్ర్యాన్ని లేదా ప్రజాస్వామ్య ప్రక్రియలను తారుమారు చేయదని ప్రస్ఫుటం చేయడమే.

అంతరిక్ష పరిశోధన, ఉపగ్రహ సాంకేతికతలలో భారత్ ఇప్పటికే అద్భుత ప్రగతి సాధించింది. ఇప్పుడిక ఇటలీ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ నైపుణ్యం తోడ్పాటుతో సంయుక్త కార్యక్రమాలు చేపట్టడం సహా భావితరం సాంకేతిక పరిజ్ఞానాల రూపకల్పనకు గణనీయ అవకాశాలు అందివస్తాయి. ప్రపంచ దేశాల శ్రేయస్సుకు భరోసా లభించాలంటే జాతీయ భద్రత-స్థిరత్వం అత్యావశ్యకం. కాబట్టే రక్షణ-భద్రత, వ్యూహాత్మక సాంకేతికతలు వంటి రంగాల్లో సహకార బలోపేతానికి ఇటలీ, భారత్ సంకల్పించాయి. కీలక సముద్ర మార్గాల భద్రతకు భరోసాతోపాటు ఉగ్రవాదం, అంతర్జాతీయ నేర నెట్‌వర్క్‌లు, మాదకద్రవ్యాల దొంగ రవాణా, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా వంటి ముప్పులను ఎదుర్కొనగల సామర్థ్యాన్ని పటిష్ఠం చేయడంలో ఈ సహకారం దోహదం చేస్తుంది.

మా భాగస్వామ్యానికి ఇంధన రంగం మరో మూలస్తంభం. వైవిధ్యభరిత ఇంధన వనరుల దిశగా ప్రపంచ ప్రస్థానంలో ఆవిష్కరణ, పెట్టుబడులు, సహకారం అత్యావశ్యకాలు. ఈ నేపథ్యంలో పునరుత్పాదక ఇంధనాల నుంచి హైడ్రోజన్ సాంకేతికతల దాకా.. స్మార్ట్ గ్రిడ్‌ల నుంచి పునరుత్థాన మౌలిక సదుపాయాల వరకూ భారత్ -ఇటలీ ఇప్పటికే సహకారం కొనసాగిస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతుల కూడలిగా మారడం కోసం భారత్ కృషి ఫలితంగా మా భాగస్వామ్యానికి అసాధారణ సామర్థ్యం సమకూరుతోంది. పునరుత్పాదక మౌలిక సదుపాయాల కల్పనలో ఇటలీకిగల అత్యాధునిక సాంకేతికతతోపాటు ఐరోపాకు ఇంధన ముఖద్వారంగా దాని వ్యూహాత్మక పాత్రకు ఇది సంపూర్ణంగా తోడ్పడుతుంది. ఈ నేపథ్యంలో భారత్ నేతృత్వాన ఏర్పడిన అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ), విపత్తు పునరుత్థాన మౌలిక సదుపాయాల కూటమి (సీడీఆర్ఐ), అంతర్జాతీయ జీవఇంధన కూటమి (జీబీఏ) వంటి సంకీర్ణ సంస్థల కృషిలో ఇతర దేశాలతోపాటు మా సహకారం కూడా కీలకం.

భౌతిక, డిజిటల్, మానవ అనుసంధానమే మా భాగస్వామ్యాన్ని మరింతగా పెనవేసిన సూత్రం. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు కీలక కేంద్రాలైన ఇండో-పసిఫిక్, మధ్యధరా ప్రాంతాల నడిబొడ్డున భారత్, ఇటలీ ఉన్నాయి. కాబట్టి, ఈ ప్రాంతాలను వేర్వేరు పరిధులుగా కాకుండా అంతకంతకూ పరస్పర సంధానితం అవుతున్న ప్రదేశాలుగా పరిగణించాలి.

# ఎల్బీ నగర్ జోనల్ విభాగానికి బాస్ ఎవరు!?

- జోనల్ కమిషనర్ ఆదేశాలకే లెక్కలేదా..?
- హయత్‌నగర్ సర్కిల్-14లో టౌన్ ప్లానింగ్ గందరగోళం
- అక్రమ నిర్మాణాలపై ఏసీపీ మౌన దీక్ష!?
- ఫీల్డ్ తనిఖీలు గల్లంతు.. కాగితాలకే చర్యలు
- నిబంధనలు పాటించినవారికే శిక్షలా..?
- ఏసీపీ విజయలక్ష్మిపై ఉన్నతస్థాయి విచారణ
- జరపాలన్న ప్రజల డిమాండ్
- చట్టం నిద్రలో.. అక్రమాలు జాగృతిలో..!



ఎల్.బి. నగర్, మే 28 (సిటీ టైమ్స్): అక్రమ నిర్మాణాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కఠినమైన చట్టాలు, నిబంధనలు అమలు చేస్తోంది. పట్టణ ప్రాంతాల్లో అనియంత్రిత నిర్మాణాలు నగర ప్రణాళికను దెబ్బతీయకుండా ఉండేందుకు ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ చట్టం ప్రకారం అనుమతి లేని నిర్మాణాలపై తక్షణ చర్యలుతీసుకోవాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ అధికారులదే.తెలంగాణ మున్సిపల్ చట్టాలు, భవన నిర్మాణ నిబంధనల ప్రకారం భవన నిర్మాణానికి ముందస్తు అనుమతి తప్పనిసరి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే వెంటనే పనులు నిలిపివేసి,కూల్చివేత నోటీసులు జారీ చేయాలి. లేఅవుట్లు, సెట్బ్యాక్ నిబంధనలు ఉల్లంఘించినా ఎలాంటి రాజకీయ, ఆర్థిక ఒత్తిడులకు లోనుకాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి.




COMPLAINT



హైకోర్టు, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అక్రమ నిర్మాణాల విషయంలో "తర్వాత చూద్దాం" అనే ధోరణికి అవకాశమే లేదు. అవసరమైతే బాధ్యులైన అధికారులపై కూడా చర్యలు తీసుకునే వెసులుబాటు ఉంది. ఈ చట్టాల అమలులో టౌన్ ప్లానింగ్ ఏసీపీ కీలక పాత్ర పోషించాలి. పర్యవేక్షణ, ఫీల్డ్ తనిఖీలు, ప్లాన్ పరిశీలనలు, అక్రమ నిర్మాణాల గుర్తింపు వంటి విధులు నిబంధనల ప్రకారం తప్పనిసరి.అయితే ఇలాంటి స్పష్టమైన చట్టాలు, ప్రభుత్వ ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ ఎల్.బి. నగర్ జోన్ పరిధిలోని హయత్‌నగర్ సర్కిల్ 14లో పట్టణ ప్రణాళిక వ్యవస్థ గందరగోళంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జోనల్ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలను సైతం పట్టించుకోని పరిస్థితులు నెలకొన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి."ఆదేశాలు ఎవరివి..? అధికారం ఎవరిది..?" అనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. టౌన్ ప్లానింగ్ పర్యవేక్షక అధికారి ఏసీపీ విజయలక్ష్మి వ్యవహారశైలి పై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## నిబంధనల ప్రకారం తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉన్నప్పటికీ..

భవన అనుమతుల పరిశీలన, అక్రమ నిర్మాణాల గుర్తింపు, లేఅవుట్లు ప్లాన్ల తనిఖీ, క్షేత్రస్థాయి పర్యవేక్షణ వంటి బాధ్యతలు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, హయత్‌నగర్ సర్కిల్‌లో ఇవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయన్న విమర్శలువెల్లు వెత్తుతున్నాయి.ఫీల్డ్‌లో నిజంగా తనిఖీలు జరుగుతున్నాయా..? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అనుమతి లేని షెడ్లు, సెట్బ్యాక్ ఉల్లంఘనలు, అదనపు అంతస్తుల నిర్మాణాలు, లేఅవుట్ నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలుపెరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మౌనం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే చట్టానికి కన్నుమూస్తే నగరానికి న్యాయం ఎక్కడ..? అన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతోంది.ఈ నేపథ్యంలో ఏసీపీ విజయలక్ష్మి వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జోనల్ కమిషనర్ ఆదేశాలను పట్టించుకోని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హయత్‌నగర్ సర్కిల్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం, టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు స్పందించి చట్టానికి ప్రాధాన్యం ఇస్తారా..? లేక అవినీతి నీడలోనే పట్టణ ప్రణాళిక కొనసాగుతుందా..? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇప్పుడు సంబంధితఉన్నతాధికారులనే ఉంది.

................................ మరిన్ని వివరాలతో తదుపరి కథనాలు "సిటీ టైమ్స్"లో ................................



# నకిలీ తప్పుడు ఓట్లను పూర్తిగా ప్రక్షాళన చేయడమే సర్ లక్ష్యం

## మాజీ పార్లమెంటు సభ్యులు పోతుగంటి రాములు

వనపర్తి సిటీ టైమ్స్ మే 28

గురువారం రోజు బిజెపి జిల్లా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ అధ్యక్షతన ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(SIR) పై కార్యాశాల నిర్వహించడం జరిగింది కార్యశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ పార్లమెంటు సభ్యులు పోతుగంటి రాములు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఉన్న నకిలీ ఓట్లు, తప్పుడు ఓట్లను పూర్తిగా ప్రక్షాళన చేయడమే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లక్ష్యమని చనిపోయిన వారి పేర్లు, వేరే ప్రాంతాలకు మారిన వారి ఓట్లను జాబితా నుండి తొలగిస్తారని తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, అక్రమ ఓట్లను తీసివేయడం ద్వారానే స్వచ్ఛమైన ఎన్నికలు సాధ్యమవుతాయని తాజాగా శాసనసభ ఎన్నికలు జరిగిన పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ పద్ధతి ద్వారా ఓటర్ల జాబితా క్లీన్ చేయడం వల్లే అక్కడ పోలింగ్ శాతం పెరిగిందని ఉదాహరణగా చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా జూన్ మరియు జూలై నెలల్లో ఈ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ జరగనుందని ఓటరు జాబితా సవరణలో ఎక్కడ రాజకీయ పార్టీల ప్రమేయం ఉండదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సవరణ నిర్వహిస్తారని కాంగ్రెస్ టిఆర్ఎస్ కమ్యూనిస్టు పార్టీలు నరేంద్ర మోడీ ని అప్రతిష్టపాలు చేయడానికి ఎస్ఐఆర్ పై రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యులు పోతుగంటి రాములు రాష్ట్ర కార్యవర్గ సభ్యుల మెంటంపల్లి పురుషోత్తం రెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోకనాథ్ రెడ్డి ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు వారణాసి కల్పన జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ జిల్లా మాజీ కార్యదర్శి బొయిల రామ్మోహన్ సూర్యవంశం శీను జ్ఞానేశ్వర్ యాదవ్ ఓ బి సి మోర్చా జిల్లా అధ్యక్షులు కొమ్ము శ్రీనివాసులు కౌన్సిలర్ విజయసాగర్ పట్టణ కార్యదర్శి చిన్న రాయుడు యువ మోర్చా పట్టణ అధ్యక్షులు మండల రాజు రాయన్న సాగర్ నాయకులు భాష పోగు నరసింహ తిరుపతయ్య యాదవ్ కొండోజు గోపీనాథ్ నక్క మహేష్ రాము నాయక్ అశోక్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు



# పాత కొత్తగూడెంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

## -తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన ధీశాలి ఎన్టీఆర్ : సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా

కొత్తగూడెం , సిటీ టైమ్స్ ,

కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాత కొత్తగూడెం నందు మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ కలిసి అక్కడ ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ ఎన్టీఆర్ పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని కొనియాడారు. నాడు ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని గుర్తుచేశారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లుగా భావించి పనిచేసిన ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, రామారావు, భవానీప్రసాద్, సాంబిరెడ్డి, మల్లేష్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.





# బాబు క్యాంపు గ్రామంలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

## - ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో అభివృద్ధి పనులు
## - గ్రామ సర్పంచ్ నునావత్ కుమారి

చుంచుపల్లి , సిటీ టైమ్స్ ,

మండల పరిధిలోని బాబు క్యాంపు గ్రామపంచాయతీలో గల నాలుగు వీధులలో సుమారు 400 మీటర్ల మిషన్ భగీరథ పైపులైన్ పొడిగింపు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశాలు మేరకు గ్రామ సర్పంచ్ నునావత్ కుమారి ఆధ్వర్యంలో పైప్ లైన్ పొడిగింపు శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ దుర్గ రాశి లక్ష్మి సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు ,జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ ఎంపీటీసీ దుర్గ రాశి వెంకన్న , గ్రామ ఉప సర్పంచ్ పోలుమూరి శ్రీనివాస్ పాల్గొని కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని, ఎన్నికల హామీలను వన్ బై వన్ పరిష్కరిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామని , ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించవచ్చని వారు సూచించారు .ఈ కార్యక్రమంలో గ్రామ వార్డ్ మెంబర్స్ జోగా అమ్మలు , తవటం మురళీకృష్ణ , ఎలదండి. సదా మోహన్ నునావత్ మేక్య , దారావత్ హరిగోపాల్ , తవటం కృష్ణవేణి , హైత బత్తుల శిరీష ,, మహమ్మద్ అఫ్రీన్ , అరుణ సిపిఐ పార్టీ, బాబు క్యాంప్ గ్రామ శాఖ కార్యదర్శి అలకొండ కోటి , యూత్ నాయకులు







డింపు కౌశిక్ ,స్థానిక గ్రామ పెద్దలు , మహిళలు , యువకులు , స్థానికులు పాల్గొన్నారు .

సిటీటైమ్స్
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com



## స్వర్గీయ నందమూరి తారక రామారావు గారికి భారతరత్న ప్రకటించాలి: సితార వెంకటేశ్వర్లు

**వనపర్తి మే 28 (సిటీ టైమ్స్)**

పెబ్బేరు మండల పరిధిలోని సూగురు గ్రామంలో తెలుగు దేశం పార్టీ నాయకుడు సితార వెంకటేశ్వర్లు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి 103 జయంతి సందర్భంగా తన ఇంటిపై తెలుగు దేశం పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయంలో ఉన్న "అన్న " ఎన్టీఆర్ గారి విగ్రహానికి పూలమాల వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘనమైన నివాళి అర్పించారు. దేశ విదేశాల్లో ఉన్న తెలుగు వారి ఆరాధ్య దైవమైన "అన్న " నందమూరి తారక రామరావు గారికి "భారత రత్న " ప్రకటించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.



## త్యాగానికి ప్రతీక బక్రీద్



- కలిసిమెలిసి ఉంటూ మతసామరస్యాన్ని చాటాలి
- సమైక్యతతోనే దేశం మరింత ముందుకు సాగుతుంది
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**కొత్తగూడెం , సిటీ టైమ్స్ ,**

కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీదేవి పల్లి మండలం బోడగుట్ట ఏరియాలో ఉన్న ఈద్గాను బక్రీద్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి, అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లిం సోదర కుటుంబాలను కలిసి వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని, అందరూ సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, మైనార్టీలపై దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటివని, సమాజంలో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని మైనార్టీ సంఘం నాయకుడు కోరడం అత్యంత అభినందనీయమని, ఇది ముస్లింల ఉదార స్వభావానికి నిదర్శనమని శ్లాఘించారు. ఈ ప్రతిపాదనను తాము పూర్తిగా స్వాగతిస్తున్నామని, ఇలాంటి ఆలోచనలు సమాజంలో మతసామరస్యాన్ని మరింత పెంపొందిస్తాయని ఆయన స్పష్టం చేశారు. పండుగ రోజున అందరి శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, మైనార్టీ సంఘాల నాయకులు నయీమ్ ఖురేషి, అబిద్ హుస్సేన్, అబ్దుల్ రబ్, అన్వార్ పాషా, యాసీన్, ఎండి యూసుఫ్, ఖమర్, ఫారూఖ్, అమీర్ ఖాద్రి, ఇస్మాయిల్, షకీల్, ఇమ్రాన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పర్వదినం నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సునిత రెడ్డి

- ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ
- బందోబస్తు విధుల్లో అప్రమత్తంగా పనిచేయాలని అధికారులకు ఆదేశాలు
- జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ముగిసిన పవిత్ర ప్రార్థనలు

**వనపర్తి,మే 28 (సిటీ టైమ్స్)**



వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలనగర్ ఈద్గా మైదానం వద్ద బక్రీద్ పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తు విధులను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్. పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. బక్రీద్ పర్వదినాన్ని జిల్లా ప్రజలు పరస్పర సౌభ్రాతృత్వం, శాంతి సామరస్యాల మధ్య ఆనందంగా జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు. ముస్లిం సోదరులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో ఐక్యత, ప్రేమాభిమానాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా మసీదులు, ఈద్గా మైదానాల వద్ద పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించారని తెలిపారు. ప్రజల సహకారంతో జిల్లా అంతటా పవిత్ర ప్రార్థనలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయని ఎస్పీ పేర్కొన్నారు. పండుగ సందర్భంగా ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి సిఐ, సుగంధ రత్నం, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై,సురేందర్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కేరళ మాజీముఖ్యమంత్రి పినరయి విజయన్ పై ఈడి దాడిని ఖండించిన సిపిఎం పార్టీ

**వనపర్తి మే 28 (సిటీ టైమ్స్)**

వనపర్తి పట్టణ సిపిఎం పార్టీ కమిటీ సభ్యులు 18 వ వార్డు కౌన్సిలర్ గంధం మదన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం, రాజు, సిపిఎం పార్టీ టౌన్ కార్యదర్శి పరమేశ్వర చారి పాల్గొని ప్రసంగించారు గత పది సంవత్సరాలుగా కేరళ ముఖ్యమంత్రిగా పినరయి విజయన్ ఉండి ఏ రాష్ట్రంలో లేని విధంగా కేరళ రాష్ట్రంలో దారిద్రరేఖకు దిగువన లేకుండా ప్రతి ఒక్కరికి న్యాయం చేసిన వ్యక్తి పేదవారికి నివసించడానికి ఇల్లు నిర్మించి ఇచ్చిన వ్యక్తి కేంద్ర బిజెపి ప్రభుత్వం కేరళకు ఇచ్చే బడ్జెట్లో కూడా సరిగ్గా ఇవ్వని పక్షంలో అయినా కూడా ఆ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇప్పుడు మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి కాంగ్రెస్ ఒక్కటై అబద్ధాలతో కాంగ్రెస్ అక్కడఅధికారంలోకి వచ్చింది వచ్చిన 15 రోజుల్లో పినరయి విజయన్ గారిపై లేనిపోని అబండాలేస్తూ బిజెపి కాంగ్రెస్ కలిసి ఈడి దాడిని చేయిస్తూ అక్కడ కమ్యూనిస్టులపై దాడులు చేస్తూ దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నారు ఎన్నికల సమయంలో డబ్బు మద్యం అధికంగా ఆశ చూపించి ప్రజలను మభ్యపెట్టి గెలిచే పార్టీలు మీవైతే నీతిగా నిజాయితీగా ఉండి డబ్బు మద్యం పంచని పార్టీ మాది గురిగింజలాంటి పార్టీలు మీవైతే ముత్యం లాంటి మా భారత కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీ నాయకులు భూ కబ్జాలకు మహిళలపై దాడులకు పాల్పడే పార్టీలు మీవైతే పేదల పక్షాన నిలబడి పేదలకు న్యాయం చేసే పార్టీ భారత కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీ మాది మీరు ఎన్ని ఈడీ దాడులు చేయించి మా పార్టీ నాయకులపై దాడులు చేయించిన మీకు భయపడేది లేదు ఇప్పటికైనా ఈడీ దాడులు కమ్యూనిస్టు నాయకులపై దాడులు ఆపకపోతే మీకు సరైన గుణపాఠం చెప్తామని హెచ్చరించడం జరిగినది ఈ యొక్క కార్యక్రమంలో టౌన్ కమిటీ సభ్యులు, జి, బాలస్వామి, ఏ ,రమేష్ ,ఎల్, బిసన్న , జి, బాలరాజు, భాస్కరు,జిల్లా ఆఫీసు కార్యదర్శి ఉమా,నందిమల్ల రాములు, పుల్లన్న ,మద్దిలేటి, బాల పిరు,మన్యం, రత్నయ్య, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.




## రైతుల్లో ఆందోళన అవసరం లేదు





- వచ్చే 15 రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేస్తాం: జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి
- అకాల వర్షా ల వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.

**వనపర్తిని 28 (సిటీ టైమ్స్)**

వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం ప్రతి ఒక్క గింజను కొనుగోలు చేసి, వచ్చే 15 రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.జిల్లా కలెక్టర్ వనపర్తి మండలం చిట్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం నిల్వ కోసం అదనంగా ఏర్పాటు చేసిన గోదామును అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి సందర్శించి అక్కడ జరుగుతున్న అన్లోడ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్ రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం ప్రతి ఒక్క గింజను కొనుగోలు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. వచ్చే 15 రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిస్థాయిలో కంప్లీట్ చేస్తామని హామీ ఇచ్చారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఆ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అకాల వర్షం కారణంగా 600 మెట్రిక్ టన్నుల ధాన్యం తడవగా వాటిని బాయిల్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో గత రెండేళ్ల నుంచి రికార్డు స్థాయిలో వరి ధాన్యం దిగుబడులు వస్తున్నాయని తెలిపారు. గతంలో సీజన్ కు 1,50,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చేదని, గత రెండేళ్ల కాలం నుంచి ఒక సీజన్ కు జిల్లాలో 2,50,00 మెట్రి టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ క్రమంలో అత్యధిక దిగుబడి ధాన్యం నిల్వ కోసం గోదాముల్లో స్థలం కొరత ఏర్పడుతుందని తెలిపారు.అదేవిధంగా జిల్లాలో ఈసారి వరి ధాన్యం కోతలు ఆలస్యంగా ప్రారంభం కావడం, బీహార్ నుండి వచ్చే హమాలీల కొరత కూడా కొనుగోళ్ల ప్రక్రియ నెమ్మదిగా సాగడానికి ఒక కారణమని తెలిపారు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్ కు సంబంధించి ఇప్పటివరకు 1,50,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలించడం జరుగుతోందని, ఇంకా లక్ష మెట్రిక్ టన్నుల దాకా కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని 45 ప్రాంతాల్లో అన్లోడింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం నిలువకు స్థలం కొరత ఏర్పడిన నేపథ్యంలో చిట్యాల మార్కెట్ యార్డులోని షెడ్ 1 ను గోదాముగా మార్పిడి చేసుకొని ధాన్యాన్ని అన్లోడింగ్ చేసి నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంకా అదనంగా స్థలాలను ఏర్పాటు చేయడం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హమాలీలను సైతం వీలైనంత ఎక్కువ మందిని రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ చిమనగుంటపల్లి శివారులో ఉన్న లక్ష్మీ వెంకటేశ్వర గోదామును సందర్శించి అక్కడ కూడా అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. హమాలీలను ఎక్కువ మందిని రప్పించి అన్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డి సి ఎస్ ఓ కాశీ విశ్వనాథ్, డి ఆర్ డి ఓ ఉమాదేవి, కార్మిక శాఖ అధికారి రవి, మార్కెటింగ్ శాఖ అధికారి స్వరణ్ సింగ్, డి సి ఓ రాణి, డిస్ట్రిక్ట్ మేనేజర్ సివిల్ సప్లై ఆంజనేయులు, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బీరం

**పానగల్ సిటీటైమ్స్ మే 28:-** పానగల్ మండలంలోని చింతకుంట గ్రామంలో ఇందిరా క్రాంతి పథకం అధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని గురువారం కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో ధాన్యం తడిసిపోతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి ధాన్యం మక్కలను త్వరితగతిన కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మామిళ్ళపల్లి శ్రీధర్ రెడ్డి, మాజీ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పెద్ద వెంకయ్య నాయుడు, పానగల్ మాజీ సర్పంచ్ సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, పార్టీ మండల కోకన్వీనర్ తిలకేశ్వర్ గౌడ్, నాయకులు చంద్రశేఖర్ నాయక్, రవికుమార్, దశరథ నాయుడు, రామకృష్ణ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహానాడు – "ప్రజల పండుగ"గా టీడీపీ సరికొత్త రాజకీయ సంస్కృతి

- మహిళలకు 33% సీట్లు.. దేశ రాజకీయాల్లో సంచలన నిర్ణయం
- స్త్రీ శక్తిని "మహాశక్తి"గా తీర్చిదిద్దే దిశగా నారా లోకేష్ చారిత్రాత్మక ప్రకటన
- జగన్ వైఖరిపై సొంత పార్టీలోనే అసంతృప్తి పెరుగుతోంది
- ఎంపీ సానా సతీష్ బాబు



**అమరావతి, మే 28, (సిటీ టైమ్స్):**

తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "మహానాడు2026" ఈసారి రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా చర్చనీయాంశంగా మారింది. "స్త్రీ శక్తి" అనే ప్రధాన థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ మహాసభలు మహిళా సాధికారత, సమాన హక్కులు, రాజకీయాల్లో మహిళల పాత్ర పెంపు వంటి అంశాలకు పెద్దపీట వేస్తున్నాయి. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ చేసిన కీలక ప్రకటన రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీసింది.2029 సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33 శాతం అసెంబ్లీ మరియు లోక్‌సభ స్థానాలు కేటాయించాలని టీడీపీ తీసుకున్న నిర్ణయం దేశ రాజకీయ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చినా, రాకపోయినా టీడీపీ మాత్రం తన మాట నిలబెట్టుకుంటుందని నారా లోకేష్ స్పష్టం చేయడం మహిళల్లో కొత్త ఆశలు రేకెత్తించిందన్నారు.

"రాజకీయాల్లో మహిళలు పురుషులతో సమానంగా ముందుకు రావాలి. పార్టీ భవిష్యత్తును నడిపించే శక్తి మహిళలదే. రాష్ట్రానికి, దేశానికి మరింత మంది మహిళా ప్రజాప్రతినిధులు అవసరం" అని నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలు మహానాడులో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మహిళలకు కేవలం హామీలు ఇవ్వడం కాకుండా, వారికి నిజమైన రాజకీయ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో టీడీపీ ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు.

**మహిళా సాధికారతకు టీడీపీ కట్టుబాటు**

టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళా సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని సానా సతీష్ బాబు గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలో మహిళల గౌరవం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టగా, చంద్రబాబు నాయకత్వంలో మహిళా సంఘాలు, డ్వాక్రా గ్రూపులకు బలమైన మద్దతు లభించిందన్నారు. ఇప్పుడు నారా లోకేష్ నాయకత్వంలో మహిళలను రాజకీయ నాయకత్వ స్థాయికి తీసుకెళ్లే దిశగా పార్టీ కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు.

దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా టీడీపీ తీసుకున్న ఈ నిర్ణయం ఇతర రాజకీయ పార్టీలకు ఆదర్శంగా నిలుస్తుందని ఆయన అన్నారు. కేవలం ఎన్నికల హామీలకే పరిమితం కాకుండా, మహిళలను విధాన నిర్ణయాల్లో భాగస్వాములను చేయాలనే దృక్పథంతో టీడీపీ ముందుకు సాగుతోందని చెప్పారు.

**"మహానాడు" తెలుగు ప్రజల ఆత్మీయ వేడుక**

మహానాడు కేవలం రాజకీయ సభ మాత్రమే కాదని, ఇది తెలుగు ప్రజల భావోద్వేగాలకు ప్రతీకగా మారిందని సానా సతీష్ బాబు పేర్కొన్నారు. ప్రతి ఏడాది జరిగే ఈ మహాసభలు పార్టీ కార్యకర్తలకు కొత్త దిశానిర్దేశం ఇవ్వడమే కాకుండా, ప్రజల సమస్యలపై చర్చించే వేదికగా నిలుస్తున్నాయని తెలిపారు.

ఈసారి పొదుపు చర్యల్లో భాగంగా హైబ్రిడ్ విధానంలో మహానాడును నిర్వహిస్తున్నప్పటికీ కార్యకర్తలు, అభిమానుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా కార్యకర్తలు హాజరవుతుండగా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా లక్షలాది మంది మహానాడు కార్యక్రమాలను వీక్షిస్తున్నారని తెలిపారు. పార్టీపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు ఇదే నిదర్శనమన్నారు.

**గన్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు**

ఇక ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరిపై ఎంపీ సానా సతీష్ బాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్ తీసుకుంటున్న నిర్ణయాల్లో స్పష్టత లేకపోవడం, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకపోవడం వల్ల సొంత పార్టీ కార్యకర్తలే అసహనానికి గురవుతున్నారని ఆరోపించారు.రాజకీయంగా అభద్రతాభావంతో ఉన్న జగన్ ప్రజల్లో రోజురోజుకూ పట్టు కోల్పోతున్నారని, ప్రజలకు ఉపయోగం లేని నిర్ణయాలతో పార్టీని గందరగోళంలోకి నెట్టేస్తున్నారని విమర్శించారు. వైసీపీ నాయకత్వంలో సమన్వయం లోపించిందని, నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు."ప్రజల సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్షం రాజకీయ ప్రతీకార ధోరణితో ముందుకు సాగుతోంది. అభివృద్ధి, సంక్షేమం వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల ప్రజలు వైసీపీని తిరస్కరిస్తున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు.

**ప్రజా ఆశయాల దిశగా టీడీపీ ప్రయాణం**

టీడీపీ మాత్రం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త రాజకీయ సంస్కృతికి శ్రీకారం చుడుతోందని సానా సతీష్ బాబు తెలిపారు. మహిళలకు పెద్దపీట వేయడం, యువతకు అవకాశాలు కల్పించడం, సామాజిక న్యాయం
అమలు చేయడం ద్వారా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. మహానాడు వేదికగా తీసుకున్న నిర్ణయాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీస్తాయని, ప్రజల మద్దతుతో టీడీపీ మరింత బలపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఖైరతాబాద్‌లో వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం



**ఖైరతాబాద్ ,మే 28, (సిటీ టైమ్స్):**

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్ చింతల్ బస్తీలో గల డా. బి.ఆర్. అంబేద్కర్ శతాబ్ది హాల్‌లో వేసవి శిక్షణా శిబిరం (జిమ్నాస్టిక్స్ & యోగా) కార్యక్రమాన్ని ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ పి. విజయ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతతోపాటు పిల్లల్లో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత పెంపొందించేందుకు యోగా, జిమ్నాస్టిక్స్ వంటి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.పిల్లలు సెలవులను సద్వినియోగం చేసుకొని క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని ఆమె సూచించారు. ఖైరతాబాద్ ప్రాంతంలో ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిమ్నాస్టిక్స్ & యోగా శిక్షకులు శ్రీ గోర్ల వినయ్ కుమార్, జిమ్నాస్టిక్స్ శిక్షకులు జి. బ్రహ్మానంద ప్రసాద్‌తో పాటు స్థానిక నాయకులు, యువత, తల్లిదండ్రులు మరియు పలువురు పాల్గొన్నారు.

# కీసర సర్కిల్ పరిధిలో ఘనంగా బక్రీద్ ప్రార్థనలు



- జవహర్‌నగర్‌లోని వివిధ ఈద్గాల్లో ప్రశాంత వాతావరణంలో వేడుకలు..
- శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రత్యేక ప్రార్థనలు.. పోలీస్ శాఖకు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కృతజ్ఞతలు..

**జవహర్‌నగర్ మే 28 ,(సిటీ టైమ్స్):**

కీసర సర్కిల్, కాప్రా మండలం, జవహర్‌నగర్ పరిధిలోని వివిధ ఈద్గాల్లో బక్రీద్ పండుగ ప్రార్థనలు గురువారం ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించి దేశంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని ప్రార్థించారు. వెంకటేశ్వర కాలనీలో షేక్ అహ్మద్ ఆధ్వర్యంలో, వికలాంగుల కాలనీలో సయ్యద్ ముబషీర్, ఎండి మొయినుద్దీన్, సయ్యద్ సైద్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. అంబేద్కర్ నగర్‌లో షేక్ అహ్మద్ భాష, ఎండి నూరుద్దీన్, మల్కారం ప్రాంతంలో ఎండి షాబుద్దీన్, ఫరానగర్‌లో కరం ఖాన్, అరుంధతి నగర్‌లో షేక్ సుల్తాన్, వైఎస్సార్ నగర్‌లో ఎండి జావీద్, ఎండి హుస్సేన్ నేతృత్వంలో భక్తులు ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు ఎండి పాషామియా, కార్యదర్శి కాలేషాతో పాటు ఎండి వహీద్, మహమ్మద్ షఫీ, షేక్ హబీబ్, అహీమ్ ఖాన్ సాబ్, టీ మస్తాన్, మహమ్మద్ సోహెల్, మహమ్మద్ మోహిత్, మహమ్మద్ అజీమ్, ఎండి బషీర్ తదితరులు పాల్గొన్నారు. బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీకగా
నిలుస్తుందని, సమస్త మానవాళికి శాంతి చేకూరాలని, అన్ని వర్గాల ప్రజలకు అల్లా కరుణించి
సుఖసంతోషాలుప్రసాదించాని ప్రార్థించినట్లు నిర్వాహకులు తెలిపారు.పండుగ కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన పోలీస్ శాఖ అధికారులకు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# వీర సావర్కర్ పోరాట చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి



- భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు

**హైదరాబాద్, మే 28, (సిటీ టైమ్స్):**

ప్రతి ఒక్కరూ దేశభక్తి, జాతీయ భావాన్ని కలిగి ఉండాలని భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు అన్నారు. వీర సావర్కర్ దేశానికి చేసిన సేవలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు వినాయక్ దామోదర్ వీర్ సావర్కర్ 143వ జయంతిని గురువారం కాచిగూడలో భజరంగ్ సేన ఘనంగా నిర్వ హించింది. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నేత వై. కృష్ణతో కలిసి సావర్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లక్ష్మణ్ రావు మాట్లాడుతూ.. దేశంకోసం వీర సావర్కర్ చేసిన పోరాటం నేడు ప్రతి భారతీయుడు తెలుసుకోవాలన్నారు. ఆంగ్లేయులు విధించిన అతి భయంకరమైన శిక్షను అనుభవించి అండమాన్ జైల్లో క్రూరమైన శిక్షను విధించినా ఏమాత్రం వెరవ కుండా పోరాడిన మహానీయుడని కొనియాడారు. సావర్కర్ పుస్తకాలు, సినిమా చూడాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. వీర సావర్కర్ దేశానికి చేసిన సేవలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. సావర్కర్ పుస్తకాలు, సినిమా చూస్తే ఆయన త్యాగాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

# విద్యానగర్ చింతల చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు





- చెరువును ఆధునీకరించి, సుందరంగా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే కూనంనేని

**చుంచుపల్లి , సిటీ టైమ్స్ ,**

చుంచుపల్లి మండల మండల పరిధిలో విద్యానగర్ పంచాయతీ లో గల చింతల చెరువు చుట్టూ రూ.1.50కోట్లతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి జరుగుతోందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపి అనుమతులు మంజూరు చేయించడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబ శివరావు అన్నారు. స్థానిక సర్పంచ్ భూక్య శాంతి శ్రీ , ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళితో కలిసి ఎమ్మెల్యే చింతల చెరువును క్షేత్రస్థాయిలో సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చింతల చెరువును మరింత ఆధునీకరించి, అద్భుతంగా సుందరీకరిస్తామని
తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఎంతగానో ఉపయోగపడే విధంగా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. స్థానికులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి ,, సర్పంచ్ శాంతి శ్రీ, భాగం నాగమణి, మాధవ రావు,
తాటి కృష్ణవేణి, ఏపూరి కృష్ణమూర్తి, కె రామారావు, కృష్ణ, నర్సింహారావు, సురేష్, గంగయ్య, భద్రం, ప్రసాద్, చౌదరి , పంచాయతీ గుమస్తా బి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 3న గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

**హైదరాబాద్, మే 28, (సిటీ టైమ్స్ ):**

గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ(జీహెచ్ జే ఎంఏసీ హెచ్ సీ) సర్వసభ్య సమావేశం జూన్ 3వ తేదీ ఉదయం 10 గంటలకు చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభ లో జరుగుతుందని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేందుకు ఇటీవల ప్రక్రియను ప్రారంభించిన సందర్భంలో జరుగుతున్న ఈ సర్వసభ్య సమావేశం అత్యంత కీలకమైనదని, సొసైటీ సభ్యులందరు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని వారు ఒక ప్రకటనలో కోరారు.జీహెచ్ఎంసీ పరిధిలో పని చేస్తున్న దాదాపు 1350 మంది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సొసైటీలో సభ్యులుగా ఉన్నారని,వీరిలో అత్యధిక శాతం జర్నలిస్టులు ఇరవై నుంచి 30 ఏళ్ళ సీనియారిటీ కలిగి ఉన్నారని పేర్కొన్నారు. 2008 నుంచి ఎంతోమంది సీనియర్ జర్నలిస్టులు సొసైటీలో సభ్యులుగా ఉండి ఇళ్ళస్థలాల కోసం ఎదురు చూస్తున్నారని, కొంతమంది సీనియర్ పాత్రికేయులు ఇళ్ళస్థలాలు పొందకుండానే చనిపోయారని వారు తెలిపారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం వచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. జూన్ 3న జరిగే సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఇళ్ళస్థలాల సమస్య పై చర్చించి ఇళ్ళస్థలాల సాధనకు కార్యాచరణను రూపొందిస్తామని, ఇందుకోసం సీనియర్ సభ్యులతో కమిటీ వేస్తామని వారు పేర్కొన్నారు.

# ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించిన జూనియర్ ఎన్టీఆర్



**హైదరాబాద్:**

తెదేపా వ్యవస్థాపకులు, ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ నివాళులు అర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రముఖుల రాక నేపథ్యంలో ఎన్టీఆర్ ఘాట్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



# మత సామరస్యానికి ప్రతీక బక్రీద్: ఆరికెపూడి గాంధీ





- ఎల్లమ్మబండ ఈద్గా, హాఫీజ్‌పేట్‌లో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్
- ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన గాంధీ
- త్యాగం, భక్తి, సామరస్యానికి ప్రతీక బక్రీద్ అని వ్యాఖ్య

**శేరిలింగంపల్లి, మే 28 (సిటీటైమ్స్):**

త్యాగానికి, దైవభక్తికి ప్రతీకగా నిలిచే పవిత్ర బక్రీద్ పండుగను మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా జరుపుకోవాలని పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఈద్గా వద్ద జరిగిన సామూహిక ప్రార్థనల్లో ఆయన పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. బక్రీద్ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది నిస్వార్థ త్యాగానికి, అచంచలమైన విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. అల్లా పట్ల ప్రవక్త ఇబ్రహీం చూపిన భక్తి, విశ్వాసాన్ని స్మరించుకుంటూ ముస్లింలు ఈ పండుగను జరుపుకుంటారని చెప్పారు. సమస్త మానవాళికి శాంతి, సౌభ్రాతృత్వం చేకూరాలని ఆకాంక్షిస్తూ.. మత సామరస్యాన్ని మరింత బలోపేతం చేసేలా పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. అనంతరం హాఫీజ్‌పేట్ డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు షేక్ జమీర్ లీమా నివాసంలో జరిగిన బక్రీద్ వేడుకల్లో కూడా ఆరికెపూడి గాంధీ పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ముస్లిం సోదరులను కలుసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. బక్రీద్ పండుగ సమాజంలో ప్రేమ, సహనం, త్యాగ భావనలను పెంపొందిస్తుందని గాంధీ పేర్కొన్నారు. అన్ని మతాలు శాంతి, మానవత్వాన్నే బోధిస్తాయని, అలాంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమాల్లో ముస్లిం మత పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హాఫీజ్‌పేట్ కార్యక్రమంలో బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఉరిటి వెంకట్‌రావు, వెంకటేష్ గౌడ్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం ఎన్టీఆర్‌దే: కట్ట వెంకటేష్ గౌడ్

- శేరిలింగంపల్లిలో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు
- మియాపూర్, మాదాపూర్, హైదర్‌నగర్‌లో విగ్రహాలకు నివాళులు
- "తిండి, గూడు, బట్ట" నినాదంతో పేదల గుండెల్లో నిలిచిన మహానేత అని కొనియాడిన టీడీపీ నేతలు



**శేరిలింగంపల్లి, మే 28 (సిటీటైమ్స్):**

తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతిని శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం మియాపూర్ జేపీనగర్‌లో అమర్‌చంద్ ఆధ్వర్యంలో, మాదాపూర్ డివిజన్ సుభాష్ చంద్ర బోస్‌నగర్‌లో ఆరేపల్లి శివగౌడ్ ఆధ్వర్యంలో, హైదర్‌నగర్ భాగ్యనగర్ సొసైటీలో పోలిన సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తదనంతరం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జూమ్ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్ట వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. "తిండి, గూడు, బట్ట" అనే నినాదంతో పేదల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. 1982లోనే రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం అమలు చేసి పేదల సంక్షేమానికి కొత్త దిశ చూపించారని గుర్తుచేశారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించడం, బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు ఇవ్వడం వంటి ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు.

తెలంగాణలో పటేల్‌పట్వారీ వ్యవస్థను రద్దు చేసి మండల వ్యవస్థను తీసుకురావడం ఎన్టీఆర్ దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలుగు జాతి ఖ్యాతిని దేశ నలుమూలలా చాటిచెప్పిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనలో భాగంగానే చంద్రబాబు నాయుడు సైబరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసి లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. ప్రపంచ స్థాయిలో సైబరాబాద్‌ను నిలబెట్టిన నాయకత్వం చంద్రబాబుదేనని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి పేద ప్రజలకు సేవలందించే దిశగా పార్టీ కార్యాచరణ రూపొందుతోందని, మరో రెండు మూడు నెలల్లో పార్టీ భవిష్యత్ దిశ స్పష్టమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ కిషోర్ యాదవ్, సోమ మధుమోహన్, శ్రవణ్ కుమార్, సాంబశివరావు, నారాయణరావు, రంగారావు, ఐఆర్‌కే రాజు, నాని ]కరి, గంట పరమేశ్వరరావు, శేషుబాబు, సత్యనారాయణ రాజు, అనిల్, కేఎస్ఆర్ ప్రసాద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వనపర్తి కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా ఎన్ టి రామారావు జయంతి వేడుకలు





- ఎన్టీ రామారావు సినీ మధుర గీతాలను ఆలపించిన వనపర్తి గాయకులు

**వనపర్తి సిటీ టైమ్స్ మే 28**

వనపర్తి పట్టణ కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో కళాకారుల ఐక్యవేదిక వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా స్వర్గీయ ఎన్ టి రామారావు 103 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఆయన సినీ జీవితంలో ఎన్నో కష్టాలు ఒడిదుడుకులను ఎదుర్కొని సైకిల్ పై పాలు అమ్ముకునే స్థాయి నుండి మహానటుడిగా ఎదిగిన చరిత్ర ఆయనది. సినీ పరిశ్రమలో సాంఘిక, జానపద, పౌరాణిక పాత్రలో నటించి ఔరా అనిపించాడు హిందువులు ఆరాధ్య దైవంగా కొలిచే శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, ఎలా ఉంటారో తెలియదు కానీ ఎన్టీ రామారావు వేసిన ఆ పాత్రలు (శ్రీరాముడు, శ్రీకృష్ణుడు) మాత్రం తెలుగు ప్రజలకు ఎన్టీ రామారావే దేవుడు అన్నంతగా అ పాత్రలో జీవించాడు. తెలుగు ప్రజల జీవన విధానాన్ని మార్చే విధంగా ఎన్నో మంచి చిత్రాలు తీసి ఆయన చిత్రాల ద్వారా ప్రజలను చైతన్య పరచారు. భక్తి సినిమాలు, అభ్యుదయ సినిమానులు తీసి తెలుగు రాష్ట్రాల్లో ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు. ఇలా ఆయన గురించి చెప్పాలంటే ఒక గ్రంథమే అవుతుంది. ఇలాంటి గొప్ప కళాకారులను (మహనీయులను) స్మరించుకోవడం తెలుగు ప్రజలపై ఉందని ఈ సందర్భంగా వారు అన్నారు. కార్యక్రమంలో వనపర్తి కళాకారులు (గాయకులు) పాల్గొని ఎన్టీ రామారావు సినిమాలోని ఎన్నో మధురమైన పాటలను పాడి శ్రోతలను అలరించారు రానున్న రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలను ప్రజల సహకారంతో పెద్ద ఎత్తున నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు నందిమల్ల రాములు (గాయకులు), డి రవిప్రసాద్ (జర్నలిస్టు & గాయకులు), గంధం రాజు (హెల్త్ అసిస్టెంట్ & గాయకులు), గంధం రవి మరియు గెస్ట్ గా విచ్చేసిన ఆర్ఎమ్ఓ రవిశంకర్ (గాయకులు), ఎస్ రవిప్రసాద్ గౌడ్ టీచర్ & గాయకులు, హెచ్ గోవింద్ టీచర్ & గాయకులు, వెంకట్ టీచర్ & గాయకులు, నందిమల్ల సాంబయ్య, ఎం సంజీవ్, డీఎస్పీ నాయకులు భీముడు, సూర్య ప్రకాష్, డి గట్టయ్య, బి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



**హైదరాబాద్, మే28,(సిటీ టైమ్స్):**

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్లో లో బీసీ సంక్షేమానికి రూ.2లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. పారిశ్రామిక పాలసీలలో, కాంట్రాక్టుల కేటాయింపులో బీసీలకు 50శాతం కోటా ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న బీసీ పథకాలకు 60శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని ఆయన అన్నారు. తెలుగు రాష్ట్రాలలో అమలు చేస్తున్న పీజురీయింబర్స్మెంట్, గురుకుల పాఠశాలలు దేశమంతా అమలు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి యూనిఫైడ్ కార్డ్

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డ్) రూపొందించాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు , సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి , ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి గారితో పాటు ఇతర ఉన్నతాధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించారు.

సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు.

ఈ కార్డ్‌లో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్ , కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు.

ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ జరగాలని సూచించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని చెప్పారు. కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్ట్‌లు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం మద్దతు ధర కల్పిస్తాం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
- కొనుగోలు కేంద్రం పరిశీలన
- రైతులకు భరోసా ఇచ్చిన పొంగులేటి, శ్రీధర్‌బాబు

**భువనగిరి, సిటీ టైమ్స్**

తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లపై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ లో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని కలెక్టర్ అనురాగ్ జయంతి వివరించారు. సమీక్షకు ముందు యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. రానున్న నాలుగు రోజులూ యంత్రాంగమంతా అప్రమత్తంగా వ్యవహరించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అధికారులకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ప్రైవేట్ లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఉపయోగించుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ 1 నాటికి కొనుగోళ్లు పూర్తి చేయాలని చెప్పారు. ఎమ్మెల్యేలు కూడా దీనికి సహకరించాలని ఆయన సూచించారు. తమ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కనీవినీ ఎరుగని రీతిలో దిగుబడులు వచ్చాయని.. ప్రతి గింజనూ రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని ఉత్తమ్ తెలిపారు. ప్రతిపక్షాలు రాజకీయం చేయడానికి యాత్రలు చేపడుతున్నాయన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. భాజపా నాయకులు బస్సు యాత్రలు చేయడం కాదని.. దిల్లీ యాత్ర చేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన నిధులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. వడ్లు అంటే తెలియని వారు వాటి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రైతులకు సంకెళ్లు వేసి నడిరోడ్డుపై తిప్పిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేల్ తదితరులు పాల్గొన్నారు.



# సిద్ధరామయ్య రాజీనామా

**బెంగళూరు, సిటీ టైమ్స్**



కర్ణాటకలో గత కొన్నేళ్లుగా సాగుతున్న సీఎం సీటు పంచాయతీ ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చినట్లయింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు. ఇక కర్ణాటక తదుపరి ముఖ్య మంత్రి డీకే శివకుమార్ అంటూ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నేతలు హింట్ ఇచ్చేశారు. తాజాగా డీకే శివకు మార్ సహా పలువురు మంత్రులతో కలిసి.. లోక్‌భవ న్‌కు వెళ్లిన సిద్ధరామయ్య.. తన రాజీనామా లేఖను ఇచ్చారు. గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటు లో లేకపోవడంతో గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖను సమర్పించారు. ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్న గవర్నర్.. సిద్ధూ రాజీనామాపై నిర్ణయం తీసుకోనున్నారు.

ఆ తర్వాత మీడియా సమావేశం నిర్వహించి.. తాను రాజీనామా చేసిన విషయాన్ని అధికారికంగా వెల్లడిం చారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం చేసిన సూచన లతోనే కర్ణాటక సీఎం పదవికి తాను రాజీనామా చేసి నట్లు తెలిపారు. ఇక కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా తీవ్ర భావోద్వేగంతో మాట్లాడిన సిద్ధరామయ్య.. తాను కింది స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు వచ్చి నట్లు గుర్తు చేసుకున్నారు. తాను ఎల్లప్పుడూ కర్ణాటక ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతోనే పనిచేసినట్లు తెలిపారు.

ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు నిరంతరం కృషి చేసినట్లు వివరించారు. 160 గ్యారెం టీలు హామీ ఇస్తే.. అందులో 158 విజయవంతంగా అమలు చేసినట్లు సిద్ధరామయ్య వెల్లడించారు. రూల్స్ ప్రకారమే రాజీనామా చేశానని.. గవర్నర్ ఆమోదం తెలుపుతారని భావిస్తున్నట్లు చెప్పారు. కర్ణాటక అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మెజార్టీ ఉందని.. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా రెండుసార్లు.. ప్రతిపక్ష నేత రెండు సార్లు సేవలు అం దించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా తనకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు సిద్ధరామయ్య ధన్యవాదాలు తెలిపారు. తాను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా నని గుర్తు చేసుకున్న సిద్ధరామయ్య 2006లో కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత తనకు అనేక అవకాశాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు చెప్పారు. ఈ నేపథ్యంలోనే సిద్ధరామయ్య ఇవాళ సాయంత్రం ఢిల్లీకి వెళ్లనున్నా రు. అక్కడ సోనియా, రాహుల్ గాంధీలతో సమావేశ మై చర్చించనున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తనకు ఏ బాధ్యతను అప్పగించినా.. తాను విధేయత తో పూర్తి చేస్తానని ప్రకటించారు.

2023లో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ముఖ్యమంత్రి ఎంపిక విషయంలో తీవ్ర సస్పెన్స్ కొనసాగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లలో ఎవరిని సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలి అనే విషయంలో తీవ్ర గందరగోళం నెలకొంది. కొన్ని రోజుల పాటు.. ఢిల్లీ, కర్ణాటకల్లో తీవ్ర రాజకీయ ఉత్కంఠ నెలకొంది. చివరికి సిద్ధరామయ్య వైపే మొగ్గు చూపిన కాంగ్రెస్ పార్టీ హైకమాండ్.. ఆయనకు ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టింది. ఇక డీకే శివకుమార్‌ను బుజ్జగించిన అధి ష్ఠానం ఆయనకు డిప్యూటీ సీఎం పదవిని ఇచ్చింది.

**కొత్త సీఎంగా డీకే శివకుమార్**

కర్ణాటకలో సీఎం మార్పు ఖాయమైంది. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. బెంగళూరులో మంత్రివర్గ సహచ రులతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో మాట్లాడిన సిద్ధూ.. తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపడతారన్నారు. సిద్ధరామయ్య నివాసంలో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ ముగిసిన అనంతరం మంత్రి హెచ్‌కే పాటిల్ మాట్లాడారు. "సిద్ధరామయ్య 3 గంటలకు సీఎం పదవికి రాజీనామా చేస్తారు. డీకే శివకుమార్‌ను కొత్త ముఖ్యమంత్రి చేస్తున్నానని సిద్ధరామయ్య చెప్పారు. డీకే సీఎం అవుతారు" అని పాటిల్ తెలిపారు.

కర్ణాటకలో సీఎం మార్పు గురించి చాలా కాలంగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఎప్పటికప్పుడు ఈ వార్తలను కాంగ్రెస్ నాయకత్వం తోసిపుచ్చింది. కొద్ది రోజుల క్రితం వరకు కూడా సీఎం పదవిని వీడటానికి సిద్ధూ సుముఖంగా లేరని ప్రచారం జరిగింది. ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం రాజ్యసభ పదవి ఆఫర్ చేయడంతోపాటు జాతీయ స్థాయిలో ఆయన సేవలను వాడుకోవాలని భావించి నట్లు వార్తలొచ్చాయి.

సీఎం పదవి చేతులు మారుతున్న వేళ.. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌తోపాటు మంత్రివర్గ సహచరులు హాజరైన బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో భావోద్వేగ దృశ్యాలు కనిపించాయి. డీకే శివకుమార్ సీఎం సిద్ధరామయ్య కాళ్లు మొక్కడం, ఆయన డీకేను పైకి లేపి హత్తుకో వడం అందర్నీ ఆకట్టుకుంది. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. డీకే సిద్ధూ కాళ్లను మొక్కుతున్న ఫొటోను చూస్తుంటే.. సీఎం కావడానికి ముందు తన సీనియర్ ఆశీస్సులు తీసుకుంటున్నట్లు గా ఉంది.

వాస్తవానికి కర్ణాటక ఎన్నికలు ముగిసిన తర్వాత సీఎం పదవి కోసం సిద్ధరామయ్యతోపాటు డీకే శివకుమార్ పోటీ పడ్డారు. అయితే సీనియర్ అయిన సిద్ధూ వైపు కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గు చూపింది. ముఖ్యమంత్రి పదవిలో చెరో రెండున్నరేళ్లు కొనసాగేలా రహస్య ఒప్పందం కుదిరిందనే ప్రచారం జరిగింది. దానికి తగ్గట్టుగానే కాంగ్రెస్ నాయకత్వం ఇప్పుడు సిద్ధూను సీఎం పదవికి రాజీనామా చేయాలని ఆదేశించింది.

# రాయదుర్గం మస్త్ పిరం!

**హైదరాబాద్, మే 28 (సిటీటైమ్స్):**



భాగ్యనగరం పశ్చిమ కారిడార్ భూముల దూకుడు మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా మారిన రాయదుర్గం పాన్‌మక్తా ప్రాంతంలో తెలంగాణ గ్లోబల్ ఇండస్ట్రియ ల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహిం చిన ఈవేలంలో ఎకరం భూమి ఏకంగా రూ.237 కోట్ల రికార్డు ధర పలికింది. గతేడాది ఇదే ప్రాంతంలో నమోదైన రూ.177 కోట్ల రికార్డును ఈసారి రూ.60 కోట్ల భారీ తేడాతో అధిగమించడం రియల్ ఎస్టేట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. సర్వే నంబర్ 83/1లోని 6 ఎకరాల 29 గుంటల ప్రీమియం భూమికి నిర్వహించిన వేలంలో దేశవ్యాప్తంగా కార్పొ రేట్ సంస్థలు, నిర్మాణ రంగ దిగ్గజాలు పోటీపడినట్లు తెలిసింది.

ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నాలెడ్జ్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్, అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉండటంతో ఈ భూమికి భారీ డిమాండ్ నెలకొన్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఎకరా నికి రూ.139 కోట్ల అప్‌సెట్ ధర నిర్ణయించినప్పటికీ బిడ్లు ఊహించని స్థాయికి చేరుకోవడం అధికార వర్గా లనూ ఆశ్చర్యానికి గురిచేసింది. కొద్ది సంవత్సరాల క్రితం వరకు రూ.40 నుంచి రూ.50 కోట్ల మధ్య ఉన్న పశ్చిమ హైదరాబాద్ భూముల ధరలు ఇప్పుడు రూ.200 కోట్ల మార్క్‌ను దాటేయడం నగర రియల్ ఎస్టేట్ విస్తరణకు నిదర్శనంగా మారింది.

హైదరాబాద్‌లో ఐటీ రంగ విస్తరణ, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు, వేగంగా అభివృద్ధి చెందిన మౌలిక వసతులు, మెట్రో కనెక్టివిటీ, ప్రపంచస్థాయి వాణిజ్య సముదాయాల ఏర్పాటుతో రాయదుర్గంకోకా పేట కారిడార్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకప్పుడు నగర శివారుగా భావించిన ఈ ప్రాంతాలు ఇప్పుడు దేశంలోనే అత్యంత ఖరీదైన వాణిజ్య భూముల కేం ద్రాలుగా మారిపోవడం గమనార్హం.

రాయదుర్గం, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలు ఇక సాధారణ రియల్ ఎస్టేట్ జోన్‌లు కాదని.. దేశ కార్పొరేట్ పెట్టుబడుల ప్రధాన కేంద్రా లుగా రూపాంతరం చెందుతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. టీజీఐఐసీ వద్ద నాలెడ్జ్ సిటీ పరిధిలో ఇంకా భారీ స్థాయిలో భూములు ఉండటంతో రాబోయే వేలాల్లో మరిన్ని రికార్డులు నమోదయ్యే అవకాశాలున్నాయని అంచనా వేస్తు న్నారు.

# జూన్ 6 వరకు ధాన్యం కొనుగోళ్లు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానిం చారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తామని పేర్కొన్నారు. గురువారం చెన్నూరు మండలం బా వురావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి పంట దిగుబడి ఎక్కువగా వచ్చిందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు.

**హమాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో ఆలస్యం..**

పెద్దపల్లిలో మూడు గోడౌన్స్ అలాట్‌మెంట్ చేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. హమాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. సింగరేణి నుంచి 40 లారీలు, మైనింగ్ శాఖ నుంచి 40 లారీలను కేటాయించామని అన్నారు. మొత్తం 80 లారీలతో త్వరలోనే రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొని మిల్లులకు తరలిస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

**ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర: మంత్రి అడ్లూరి**

ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శిం చారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈరోజు (గురువారం) జగిత్యాల జిల్లాలో మంత్రి అడ్లూరి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాలు పేరుతో దోచుకుంటున్నామని బీజేపీ నాయకులు ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు.

బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే భద్రాద్రి రాముడి ఆలయం ముందు మాట్లాడాలని మంత్రి అడ్లూరి సవాల్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం సరిగా లేకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. సీఎం రేవంత్‌రెడ్డితో కలసి పనిచేద్దామని అన్నారని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకురా వడంలో కేంద్ర మంత్రులు విఫలమయ్యారని విమర్శించారు. గోదావరి పుష్కరాలకు కేంద్రం నుంచి బీజేపీ ఎంపీలు నిధులను తీసుకురావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ చేశారు.



# అత్త గిరిబాల సింగ్ అరెస్ట్

**- ట్విషా శర్మ రీ-పోస్ట్‌మార్టంలో షాకింగ్ ట్విస్ట్**

**- కీలక విషయాలు రాబట్టిన సీబీఐ**

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలుగు నటి ట్విషా శర్మ మృతి కేసులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సీబీఐ రంగంలోకి దిగాక అనేక కీలక విషయాలు రాబట్టింది. ఇక రెండోసారి రీపోస్ట్‌మార్టం జరిగాక అనేక దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. తొలి పోస్ట్‌మార్టంలో ఆత్మహత్య చేసుకున్నట్లు రిపోర్ట్ వచ్చినా.. తాజాగా రెండోసారి జరిపిన పోస్ట్‌మార్టంలో మాత్రం సంచలన విషయాలు బయటపడ్డాయి. ట్విషా శర్మ దేహంపై ఉన్న గాయాలు.. ఆత్మహత్య తర్వాత జరిగినవి కావని.. ఆత్మహత్యకు ముందే ఆమెపై గాయాలు ఉన్నట్లుగా పేర్కొంది. ఆత్మహత్యకు ముందు భార్యాభర్తల మధ్య తీవ్ర పెనుగులాట జరిగిందని.. ఈ ఘర్షణలోనే ట్విషా శర్మకు గాయా లయ్యాయని నివేదికలో వెల్లడైంది. అయితే ఈ కేసులో ప్రధాన నిందితులైన భర్త సమర్థ్‌సింగ్, అత్త గిరిబాలా సింగ్ అబద్ధాలు చెబుతుండడంతో సీబీఐ అధికారులు నేరుగా రంగంలోకి దిగారు. గురువారం ఉదయం సీబీఐ బృందం గిరిబాలా సింగ్ నివాసానికి చేరుకుని విచారణ అనంతరం అదుపులోకి తీసుకున్నారు. గిరిబాలా సింగ్‌ను కస్టడీలో విచారించడం అవసరమని మధ్యప్రదేశ్ హైకోర్టుకు సీబీఐ తెలిపింది. విచారణ సందర్భంగా ట్విషా శర్మ వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికి గిరిబాలా సింగ్ ఏ మాత్రం వెనుకాడలేదని సీబీఐ ఆరోపించింది. ట్విషా శర్మను వరకట్న వేధింపులకు గురి చేశారని.. కీలక ఆధారాలను నాశనం చేసేందుకు ప్రయత్నించారని.. బలవంతంగా గర్భస్రావం చేయించారని సీబీఐ ఆరోపించింది.

ట్విషా శర్మ మణికట్టు, మోచేతుల దగ్గర గాయాల గుర్తులు కనిపించాయని సీబీఐ కోర్టుకు వెల్లడించింది. ఆ గాయాలు ఎలా వచ్చాయన్న దానిపై అత్తింటి వారు సరైన వివరణ ఇవ్వలేదని తెలిపింది. మృతదేహాన్ని ఉరితాడు నుంచి దించేటప్పుడు ఆ గాయాలు ఏర్పడలేదని మెడికల్ రిపోర్ట్ స్పష్టం చేసినట్లు పేర్కొంది. పోస్ట్‌మార్టం నివే దికలో నమోదైన గాయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సీబీఐ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇక దర్యాప్తులో సేకరించిన వాట్సాప్ చాట్స్ ఆధారంగా అత్త గిరిబాలా సింగ్, భర్త సమర్థ్ సింగ్‌లు ఆమె గర్భం దాల్చిన తర్వాత ఆమె వ్యక్తిత్వంపై అనుమానాలు వ్యక్తం చేసినట్లు తెలిపింది. పుట్టబోయే బిడ్డ మరొకరికి చెందినదని ఆరోపిస్తూ ట్విషాపై ఒత్తిడి తెచ్చి గర్భస్రావం చేయించారని సీబీఐ పేర్కొంది.





# పొంగులేటి కట్టుబడి ఉండాలి

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు.

"ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది. స్వరాష్ట్రాన్ని సాధించాం.. స్వగృహ స్వప్నాల ను సాకారం చేశాం. డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాం. 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా? శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలి. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే.. ఓట్లు అడుగుతాం అనే సవాల్‌కు కట్టుబడి ఉండాలి.

హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిన ఘనత మాది. రూ.70 వేలతో మేం అగ్గిపెట్టె ఇళ్లు కట్టలేదు. మేం కట్టిన ఒక్కో ఇల్లు.. 7 ఇందిరమ్మ ఇళ్లతో సమానం. వీకెండ్‌లో ప్రజలు ఇళ్లు కూల్చి వికృతానందం పొందుతున్నారు. రెండున్నరేళ్లలో నగరంలో కట్టిన ఇళ్లు ఎన్ని? పడ గొట్టిన ఇళ్లు ఎన్ని?.. దీనిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా? మీరెన్ని ప్రగల్భాలు పలికినా, డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టం" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# కాజీపేటలో ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ



**- ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్**

**- మెరుగైన వెంటిలేషన్‌తో రూపొందుతాయి**

**కాజీపేట, సిటీ టైమ్స్**

కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని చెప్పారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై అశ్వినీ వైష్ణవ్ కీలక సమీక్ష నిర్వహించారు. రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్ 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేస్తుందన్నారు. వీటిని దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు రైల్వే మంత్రి తెలిపారు.

"కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలే షన్‌తో రూపొందుతాయి. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయి. వీటిలో సురక్షితమైన కోచ్ డిజైన్, ఆధునిక సౌకర్యాలు అమర్చుతాం. ఈ రైళ్లు గంటకు 130 కి.మీ వేగంతో ప్రయాణించేలా రూపొం దిస్తాం. వీటిలో రీజనరేటివ్ బ్రేకింగ్ కూడా ఉంటుంది. రైలు బ్రేకులు వేసినప్పుడు అది విద్యుత్ జనరేటర్‌గా మారి, పునరుత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే అధునాతన పరిజ్ఞానంతో తయారు చేస్తున్నాం" అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

# ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని వ్యాఖ్యానిం చారు. నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో ముస్లిం సోదరులను కలిసి మాట్లాడారు. బక్రీద్ కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదని... ఇది మానవాళికి ఒక గొప్ప జీవన సం దేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయాలకు అతీతంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడో' యాత్ర చేపట్టారని ప్రస్తావించారు.

అన్నివర్గాలు, అన్నిమతాల ప్రజలు సమానమేనని, అందరు కలిసి మెలిసి ఉండాలనే గొప్ప సందేశంతో 'భారత్ జోడో' యాత్ర చేశారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అనడానికి ఇది ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. నల్గొండలో మతసామరస్యానికి, గంగా జమునా తెహజీబ్‌కు నిలువెత్తు సాక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.



సిటీటైమ్స్
www.citytimesnews.com





# మీరు గర్వపడేలా చేస్తాను

## కమల్ హాసన్‌కు భాగ్యశ్రీ ప్రామిస్

కోలీవుడ్ నటుడు శివ కార్తికేయన్ 'సెయాన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కమల్ హాసన్ సొంత నిర్మాణసంస్థపై ఈ సినిమా రానుంది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తోన్న భాగ్యశ్రీ బోర్సే తాజాగా కమల్‌ను కలిశారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. "డియర్ కమల్ హాసన్ సర్.. చిన్నప్పటినుంచి మిమ్మల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడు ఆ చిన్న అమ్మాయి మీ సినిమాలో నటిస్తోంది. మీరు నా తలపై చేయి వేసి ఆశీర్వదించిన క్షణాలను వర్ణించడానికి మాటలు సరిపోవు. మీరు గర్వపడేలా చేస్తానని ప్రామిస్ చేస్తున్నా" అని భాగ్యశ్రీ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటో, ఆమె పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'అమరన్' విజయం తర్వాత శివకార్తికేయన్.. కమల్‌హాసన్ సొంత నిర్మాణసంస్థలో చేస్తున్న రెండో చిత్రమిది. శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్నారు. "ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా. కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే భావోద్వేగాలు, మాస్ యాక్షన్, వినోదాన్ని మిళితం చేసుకుని ఉంటుంది" అని టీమ్ తెలిపింది. ఈ సినిమా అక్టోబరులో థియేటర్లలోకి రానుంది.

# సనాతన ధర్మంలోని ఆ రహస్యాలేంటి!



"భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న ఆధ్యాత్మిక రహస్యాల్ని ఆధారం చేసుకుని రూపొందించిన చిత్రమే 'త్రికాల" అన్నారు దర్శకుడు మణి తెల్లగూటి. ఆయన రూపొందించిన ఈ సినిమాలో శ్రద్ధా దాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్, ఆమని ప్రధాన పాత్రలు పోషించారు. రాధిక - శ్రీనివాస్ నిర్మించారు. ఈ చిత్రం చాగంటి ప్రొడక్షన్ ఎల్ఎల్‌పి సంస్థ ద్వారా ఈనెల 28న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మణి మాట్లాడుతూ.. "ఈ ప్రపంచంపై చీకట్లు కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే ఓ శక్తి నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. ఇది ఆద్యంతం థ్రిల్లింగ్‌గా సాగుతూ ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందిస్తుంది" అన్నారు. ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతమందిస్తున్నారు.


# 'ఆల్ఫా'లో ప్రతినాయిక పాత్రలో అలియా!



'జిగ్రా' సినిమా తర్వాత బాలీవుడ్ కథానాయిక అలియా భట్ పూర్తిస్థాయి యాక్షన్ అవతారంలో కనిపించనున్న సినిమా 'ఆల్ఫా' అని గతంలో చిత్రావర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న మొదటి మహిళా గూఢచారి చిత్రమిది. శివ్‌రావెల్ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే తాజాగా ఇందులో అలియా పాత్ర.. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఇప్పటివరకు కనిపించిన హీరో పాత్రలన్నింటికీ భిన్నంగా ఉండబోతుందని తెలిసింది. ఈ చిత్రంలో ఆమె పాత్రని బాల్యం నుంచే ఆసక్తికర నేపథ్యంతో తీర్చిదిద్దినట్లు సమాచారం. "వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌కు 'ఆల్ఫా' చిత్రం ఒక పెద్ద మలుపు కాబోతుంది. ఈ యూనివర్స్‌లో ఇంతకుముందు మనం చూసిన గూఢచారి పాత్రలకు భిన్నంగా ఇందులో ప్రధానపాత్ర ఓ హంతకురాలు. బాల్యం నుంచే ఆమెని సన్నద్ధం చేస్తారు. పూర్తిగా ప్రతినాయిక ఛాయలున్న ఈ పాత్రలో అలియాని చాలా శక్తిమంతంగా తెరపై పరిచయం చేయనున్నార"ని బాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

# చక్ దే ఇండియా నటుడు రమాకాంత్ మృతి

ప్రముఖ బాలీవుడ్ సీనియర్ నటుడు రమాకాంత్ దాయమా(69) కన్నుమూశారు. ఈ విషయాన్ని నటి శుభాంగీ లట్కర్ ఇన్‌స్టాలో అధికారికంగా తెలిపారు. "రమాకాంత్ నాకు తెలిసిన వారిలో అత్యంత బలవంతుడు, ధైర్యవంతుడు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఉన్నారని మా అందరికీ తెలిసినప్పటికీ ఎక్కడో ఓ చోట ఆశ వదులుకోలేదు. మాకు ఎన్నో ప్రణాళికలున్నాయి. ఓ హిందీ నాటకంతో పాటు కలిసి వేదికపై అందమైన కవితల్ని ప్రదర్శించాలని అనుకున్నాం. ఆ కల ఇప్పుడు అసంపూర్తిగానే మిగిలిపోయింది. కొన్ని నష్టాలను మాటల్లో వర్ణించలేని నిశ్శబ్దాన్ని మిగిల్చి వెళ్తాయి. మీ ఆప్యాయత, కళా స్ఫూర్తి మా మనసుల్లో ఎప్పటికీ సజీవంగా ఉంటాయి. మీ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాము" అనే వ్యాఖ్యల్ని జోడించారు. 'చక్ దే ఇండియా' సినిమాతో హిందీ చిత్రపరిశ్రమలో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు రమాకాంత్. 'స్కామ్ 1992: ది హర్షద్ మెహతా స్టోరీ', 'రామ్ సేతు', 'బ్రదర్స్', 'క్రూ', 'ఫర్జీ', 'ది ట్రయల్' లాంటి పలు చిత్రాలు, సిరీస్‌లలో కీలకపాత్రలు పోషించారు. పలు వాణిజ్య ప్రకటనలతోనూ ఆయన ప్రతి ఇంటికి సుపరిచితమే. రమాకాంత్ మృతిపట్ల విచారం వ్యక్తం చేస్తూ సినీపరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం తెలిపారు.





# ఇదంతా పబ్లిసిటీ కోసం కాదు!

వేరే పరిశ్రమకి వెళ్లినప్పుడు అక్కడి స్థానిక భాష మాట్లాడటం చాలా ముఖ్యమని, ఇదంతా పబ్లిసిటీ కోసం కాదని అంటోంది అందాల తార శ్రీలీల. భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకుల్ని అలరించే ఈ భామ.. తన డ్యాన్స్‌తో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె వివిధ ప్రాంతాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడం గురించి మాట్లాడింది. "నా విషయానికొస్తే... నేను ప్రతి భాషను గౌరవిస్తాను. పలు చిత్రపరిశ్రమల్లో అవకాశాలు అందుకుంటూ పనిచేస్తున్నా... కాబట్టి ఒక ప్రాంతానికి వెళ్లినప్పుడు తప్పకుండా అక్కడి భాషలోనే మాట్లాడతా. ఆ ప్రదేశానికి, అక్కడి భాషకు, ప్రజలకు ఇచ్చే గౌరవం అది. సినీతారలకు, ప్రేక్షకులకు మధ్య భాష ఒక భావోద్వేగ వారధిలాగా ఉంటుంది. అందుకే ప్రచార కార్యక్రమాల్లో స్థానిక భాషల్లో మాట్లాడటం వల్ల వారి మధ్య దూరం తగ్గుతుందనేది నా అభిప్రాయమ"ని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె హిందీలో కార్తిక్ ఆర్యన్‌తో ఓ ప్రేమకథా చిత్రంతో పాటు ధనుష్ నటిస్తున్న మరో సినిమాలో నాయికగా నటిస్తుంది.



Printed, Published and Owned by **B.PRAMOD KUMAR**, B258, Phase1, Vanasthalipuram, Hyderabad 70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor : **N.Ramakrishna Reddy**, email: citytimestd@gmail.com, **RNI: APTEL/2001/5896**